
శ్రీ పొట్టిశ్రీరాములు నెల్లూరు వార్త



## శాశ్వత ముఖ్యమంత్రిగా జగన్మోహన్‌రెడ్డి



**మనుబోలు, డిసెంబరు 1 ప్రభాతవార్త** రాష్ట్రంలో శాశ్వత ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డేనని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి తెలిపారు. మండలంలోని కాగితాలపూరు గ్రామంలో గురువారం సాయంత్రం గడపగడపకు మన ప్రభుత్వ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఆయన ముందుగా ఆ గ్రామ సర్పంచ్ చెముడుగుంట ఏడుకొండలు, వైసిపి నాయకుడు గుమ్మా రవి ఆధ్వర్యంలో సిమెంటు రోడ్డు, డ్రైనేజి కాలువలను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాగితాలపూరుకు గత మూడేళ్లలో కోటి 62 లక్షలు నిధులు మంజూరు చేసినట్లు తెలిపారు. మండలంలో 85 కోట్ల రూపాయలు నిధులు మంజూరు చేసినట్లు తెలిపారు. ప్రభుత్వం, ప్రజల మధ్య సత్సంబంధాల కోసం గడపగడపకు ప్రభుత్వ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు చెప్పారు. కాగితాలపూర్‌లో పేద వాడికి జగనన్న కాలనీలలో ఇళ్లు నిర్మిస్తుంటే అడుగడుగునా అడ్డంకులు సృష్టిస్తున్నారని విమర్శించారు. ఇదేమి ఖర్మరా బాబూ చంద్రబాబు నాయుడు వల్ల జామాత, దశమ గ్రహ సామెతను కాకాణి చెప్పడం విశేషం. ఈ కార్యక్రమంలో గడపగడపకు మంత్రి వెళ్లి అర్ధరాత్రి వరకు కార్యక్రమంలో పాల్గొన్నారు. తహశీల్దార్ వి.సుధీర్, ఎంపిపి గుండాల వజ్రమ్మ, ఎంపిడివో గండవరం వెంకటేశ్వర్లు, సొసైటీ అధ్యక్షులు మారంరెడ్డి ప్రదీప్‌కుమార్‌రెడ్డి, ఎంపిటిసి గుమ్మడి వెంకట సుబ్బయ్య, సొసైటీ డైరక్టర్ ఉప్పలపాటి రామసుబ్బానాయుడు, ఆ గ్రామ వైసిపి నాయకులు వెడిచెర్ల శ్రీనివాసులురెడ్డి, గోను దశయ్య, అడపాల శ్రీనివాసులురెడ్డి, శేషగిరి, ఆర్.మునికృష్ణయ్య, నిరంజన్, శేషయ్య, ఇవోపిఆర్‌డి వెంకట రమణ,ఇవో విమల తదితరులు పాల్గొన్నారు.

## విద్యార్థులతో ఆర్‌జెడి సహపంక్తి భోజనం



**పొదలకూరు డిసెంబర్ 1 ప్రభాతవార్త** పట్టణంలోని బాలుర,బాలికోన్నత పాఠశాలలను గుంటూరు ఆర్‌జెడి సుబ్బారావు గురువారం సందర్శించారు. అనంతరం నాడు-నేడు పనులను ,మరుగుదొడ్ల నిర్వహణను తనీకి చేశారు.మద్యహ్న బోజనం పథకం పనితీరును పరిశీలించి తానే స్వయంగా విద్యార్దులతో కలిసి సహపంక్తి బోజనం చేశారు. అనంతరం ఆర్‌జెడి మాట్లాడుతు మద్యహ్న బోజనం సంతృప్తి కరంగా ఉందని అన్నారు.అనంతరం విద్యార్ది తరగతి గదులను పరిశీలించి విద్యార్దులతో విద్యా విషయాలను మాట్లాడి వారి పురోగతిని పరిశీలించి అభినందించారు.వారి వెంట రీజనల్ ఇనస్పెక్టర్ ఆఫ్ ఫిజికల్ ఎడ్యుకేషన్ షేక్ మహబూభాషా, బాలుర ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు సనత్‌కుమార్, ఉపాధ్యాయనీ, ఉపాధ్యాయులు పాల్గోన్నారు.

## కాకాణి ఇలాకాలో వారానికి ఒక కుంభకోణం



**నెల్లూరు డిసెంబర్ 1, ప్రభాతవార్త-వైద్యం** సర్వేపల్లి నియోజకవర్గంలో మంత్రి కాకాణి.గోవర్ధన్‌రెడ్డి ఇలాకాలో కుంభకోణాలని, వారానికి ఒకటి చొప్పున వెలుగులోకి తీసుకువస్తానని తెలుగుదేశం పార్టీ పొలిట్‌బ్యూరో సభ్యుడు, మాజీమంత్రి సోమిరెడ్డి.చంద్రమోహన్‌రెడ్డి స్పష్టం చేశారు. వెంకటాచలం మండలంలో హైవేని ఆనుకుని ఉన్న సీతమ్మ చలివేంద్రానికి చెందిన రూ.250కోట్ల విలువైన 75 ఎకరాలను కాకాణి బినామీలు కబ్జాచేశారని, ఇందుకు సంబంధించిన వివరాలను గురువారం నగరంలోని తెలుగుదేశం పార్టీ జిల్లా కేంద్ర కార్యాలయంలో విలేఖరులకు వివరించారు. ఒ మహాదాత సీతమ్మ చలివేంద్రానికి 300 ఎకరాలు దానం చేశారన్నారు. అందులో అతికొద్ది భాగం పేదలు సాగు చేసుకుంటున్నారని, వాటికి జోలికి తాము వెళ్ళడం లేదన్నారు. ఇదే 300ల ఎకరాలపై భక్తులు హైకోర్టుకి వెళ్ళగా ఇది దేవాదాయశాఖ భూములని స్పష్టంగా తీర్పు ఇచ్చారని తెలిపారు. ఆ కేసు ఇంకా నడుస్తుందన్నారు. ఇలా ఉండగానే ఆభూముల్లో ఏడున్నర ఎకరాలు జగనన్న కాలనీకి కేటాయించారని ఆయన పేర్కొన్నారు. రేపు కోర్టు ఆ ఇళ్ళను తొలగించమని తీర్పు ఇస్తే వాళ్ళ గతేంటన్నారు. జగనన్న కాలనీలని అడ్డుపెట్టుకుని 75 ఎకరాలు భూమిని కబ్జా చేశారన్నారు. కాకాణి అధికారంలోకి వచ్చాక తోడేళ్ళ మంద పెరిగిపోయిందన్నారు. ఆ బ్యాచ్ కనుసన్నల్లో అనేక కుంభకోణాలు జరుగుతున్నాయన్నారు. ఇవే భూములు కాకుండా కాకుటూరు దగ్గర 8 ఎకరాలు కబ్జా చేయగా కొంతమంది జైలు కెళ్ళారన్నారు. ఎమ్మార్వో తప్పించుకున్నాడన్నారు. అదే ఎమ్మార్వో గ్రామంలో లేని వడ్లమూడి.వెంకయ్య, కౌసల్యమ్మ తదితరుల అనేకమంది పేర్లను రికార్డుల్లో చేర్చి వారసత్వంగా చూపించాడని ఆయన ఆరోపించారు. సీతమ్మ చలివేంద్రం భూములను 2020లో కాకాణి బినామీల పేర్ల మీద ప్రసాద్ రికార్డుల్లో ఎక్కించడం మొదలు పెట్టారన్నారు. దేవాదాయ శాఖ భూమలని రికార్డుల్లో ఉన్నా తహశీల్దార్ లెక్క చేయలేదన్నారు. ఐఎస్.ప్రసాద్ అక్రమాలకు పాల్పడ్డాని నివేదిక ఉన్నా కాకాణి ఒత్తిడితో కలెక్టర్ చర్యలు తీసుకోలేకపోతున్నాడన్నారు. కాకాణి ప్రధాన అనుచరుడు ఆ భూముల్లో తన తాత సొత్తులాగా ఇసుక డంపింగ్ చేసుకునేందుకు నెలకు రూ.2లక్షలు వసూలు చేస్తున్నాడని వివరించాడు. మరో 500ల ఎకరాలు భూమిని కబ్జా చేశారని సోమిరెడ్డి వెల్లడించారు. ఐఎస్.ప్రసాద్ ఎమ్మార్వో ఇద్దరిని చంపిన ఎస్ఐ కరిముల్లా లాంటి వాళ్ళని అడ్డుపెట్టుకుని భూములు, టేల్‌గేట్లు, గ్రావెల్ లాంటి వాటిని దోపిడి చేయడమే కాకుండా, ఇప్పుడు పొదలకూరు దగ్గర ఉన్న షుగరు ఫ్యాక్టరీపై కన్ను పడిందన్నారు. ఆ ఫ్యాక్టరీ భూములను కబ్జా చేసేందుకు చర్యలు చేపట్టారని వెల్లడించారు. పొదలకూరు తహశీల్దారుగా ఉన్న స్వాతి అనేక అక్రమాలకు పాల్పడిందని అయినప్పుటికి కలెక్టర్ ఆమెను ఎందుకు సస్పెండ్ చేయలేదని సోమిరెడ్డి నిలదీశారు. తహశీల్దార్ ప్రసాద్ 60 ఎకరాల కబ్జా చేశాడన్నారు. అవినీతికి పాల్పడుతున్న అధికారులైన తహశీల్దార్ ఐఎస్.ప్రసాద్, ఎస్ఐ కరిముల్లాలను తన సొంత మండలాల్లోనే మంత్రి నియమించుకుంటూ వారికి అండగా ఉంటున్నాడని సోమిరెడ్డి ఆరోపించాడు. మంత్రి కాకాణికి సజ్జల.రామకృష్ణారెడ్డి అండగా ఉన్నాడని ఆయన ధ్వజమెత్తాడు. వైసీపీ ఎమ్మెల్యే ఆనం.రామనారాయణరెడ్డి స్వయంగా సర్వేపల్లి నియోజకవర్గంలో కుంభకోణాలు అధికమైపోయాయని జడ్పీలో జరిగిన సమీక్షా సమావేశంలో సైతం ఆరోపించారు. ఇప్పటికే ప్రభగిరిపట్నం షుగర్ ఫ్యాకర్టీకి సంబంధించిన భూముల్లో కొన్నింటిని కబ్జా చేసేసినట్లు కూడా తెలుస్తోందన్నారు. సర్వేపల్లిలో కాకాణి చేయించే పనుల్లో భాగస్వాములు అవుతున్న కొంతమంది అధికారులందరూ జైలు జీవితం గడపాల్సి వస్తుందని ఆయన హెచ్చరించారు. ఐఎఎస్ అధికారులు ధైర్యంగా పనిచేసి ప్రభుత్వ, దేవాదాయశాఖ భూములను కాపాడాలని, తాము లోకాయుక్తకు ఫిర్యాదు చేస్తేనే ఐఎఎస్ అధికారులు స్పందిస్తారాని సోమిరెడ్డి ప్రశ్నించారు. రామదాసు కండ్రిగ ప్రాంతంలో కోట్ల విలువైన భూములను గ్రావెల్, అక్రమ మైనింగ్‌తో బావులుగా మారుస్తుంటే అధికారులు ఎందుకు పట్టించుకోవడం లేదని, కాకాణిని చూసి భయపడుతున్నారా, లేకపోతే ఆయన మిమ్మల్ని బెదిరిస్తున్నాడని ప్రశ్నించాడు. రేయింబవళ్ళు విధులు నిర్వర్తించే రెవెన్యు, పోలీసు అధికారులంటే మాకు ఎలాంటి ద్వేషం లేదని, మంత్రితోపాటు, మరికొందరి మాటలు విని కుంభకోణాల్లో ప్రత్యక్షంగా కాని, పరోక్షంగా భాగముండే అధికారులను మాత్రం వదిలే ప్రసక్తే లేదని, వారిని జైలుకు పంపే వరకు నిద్రపోమని ఆయన హెచ్చరించారు. ఎన్నో ఏళ్ళుగా అధికారంలో, ప్రజాజీవితంలో ఉన్నా ఇలాంటి అరాచకాలు, అక్రమాలు, దోపిడీలు, అధికార దుర్వినియోగం ఎన్నడూ చూడలేదని, చేయలేదన్నారు. అవినీతి అక్రమాలకు పాల్పడుతున్న వారిపై పోరాటం చేసి వారిని జైలుకు పంపేదాకా టీడీపీ ఆధ్వర్యంలో జిల్లా అవసరమైతే రాష్ట్ర నాయకులను సైతం పోరాటాలకు తీసుకుని వస్తామన్నారు. ఈ సమావేశంలో టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి బీద.రవిచంద్ర, టీడీపీ జిల్లా అధ్యక్షుడు అబ్దుల్‌అజీజ్, బొమ్మి.సురేంద్రలు పాల్గొన్నారు.

## డీపీవో ధనలక్ష్మి బదిలీ



**నెల్లూరు అర్బన్, డిసెంబరు 1, ప్రభాతవార్త:** నెల్లూరు జిల్లా పంచాయతీ అధికారి ఎం.ధనలక్ష్మి తిరుపతి జిల్లా డీపీవోగా బదిలీ అయ్యారు. గతంలో జిల్లాలో అనేక సేవలు అందిస్తూ 2019-2022 వరకు జిల్లాలో పని చేశారు. జిల్లాలో వరదలలో ఎన్నికల సమయంలో స్పెషల్ అధికారిగా విధులు నిర్వర్తించి జిల్లా నుంచి బదిలీ అయ్యారు.

## నూతన పరిశ్రమల ఏర్పాటుకు ప్రోత్సాహకాలు అందించాలి

**నెల్లూరు కార్పొరేషన్, డిసెంబరు 1, ప్రభాతవార్త:** జిల్లాలో పరిశ్రమలు నెలకొల్పేందుకు ముందుకొస్తున్న ఔత్సాహికులకు అన్ని విధాలా ప్రోత్సాహకాలు అందించాలని, సకాలంలో అనుమతులు మంజూరు చేయాలని జిల్లా కలెక్టర్ కె.వి.ఎన్.చక్రధర్‌బాబు సంబంధించిన అధికారులను ఆదేశించారు. గురువారం ఉదయం కలెక్టర్ వారి క్యాంపు కార్యాలయంలో జిల్లా పరిశ్రమలు ఎగుమతుల ప్రోత్సాహక కమిటీ సమావేశం నిర్వహించిన కలెక్టర్ పరిశ్రమల స్థితిగతులు - అనుమతులు - ప్రోత్సాహకాలపై సుదీర్ఘంగా సమీక్షించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో పరిశ్రమల నిర్వాహకులకు క్షేత్ర స్థాయిలో భూముల కేటాయింపు, మౌలిక వసతుల కల్పన, రుణాల



మంజూరుకు ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు. పరిశ్రమలకు కేటాయించిన భూములలో రోడ్లు, విద్యుత్ వంటి మౌలిక వసతుల కల్పనకు ప్రాధాన్యతనివ్వాలన్నారు. ప్రభుత్వం నుంచి అందే రాయితీలను కూడా వారికి సకాలంలో అందించాలన్నారు. జిల్లాలో ఎక్కువ మంది నిరుద్యోగులకు ఉద్యోగ ఉపాధి అవకాశాలు లభించేలా అవకాశం ఉన్న పరిశ్రమలను నెలకొల్పేలా చర్యలు చేపట్టాలని సూచించారు. ఈ సమావేశంలో జిల్లా పరిశ్రమల కేంద్రం జనరల్ మేనేజర్ మారుతి ప్రసాద్, ఏపీఐఐసీ జెడ్‌ఎం చంద్రశేఖర్, టిడిసి చందర్, డీపీవో ధనలక్ష్మి, జిల్లా ఉపాధి కల్పనాధికారి సురేష్‌కుమార్, విద్యుత్ ట్రాన్స్‌కో ఎస్‌ఈలు వెంకటసుబ్బయ్య, శ్రీనివాసులు, కార్మిక శాఖ ఉప కమిషనర్ వెంకటేశ్వర్లు, ఏపీఎంఐపీ పీడీ శ్రీనివాసులు, లీడ్ డిస్ట్రిక్ట్ మేనేజర్ శ్రీకాంత్ ప్రదీప్, పలు పరిశ్రమల నిర్వాహకులు పాల్గొన్నారు.

## సీతారామపురం మండలానికి మహర్దశ

**సీతారామపురం డిసెంబర్ 1 ప్రభాతవార్త** బెంగుళూరు నుండి కడపమీదుగా సీతారామపరం మండలాన్ని తాకుతు విజయవాడకు వేయబోయే జాతీయ రహదారి నిర్మాణ పనులు పూర్తి అయితే మండలానికి మహర్దశ వస్తుందని జిల్లా జాయింట్ కలెక్టర్ కూర్మానాథ్ తెలిపారు. గురువారం స్థానిక తహసిల్దారు కార్యాలయాం ఆవరణంలో నిర్వహించిన పర్యావరణ ప్రజాభిప్రాయ సేకరణలో పాల్గోని మాట్లాడారు. మండలంలో సీతారామపురం, మారంరెడ్డిపల్లి,గుండుపల్లి,నారాయణమ్మపేట,బబ్బులేటిపల్లి ,గ్రామాల మీదుగా 16 కిలోమీటర్ల మేరకు ఆరులైన్ల గ్రీన్‌వే ఎక్స్‌ప్రెస్ హైవే రోడ్డు నిర్మాణం జరుగుతుందని అన్నారు.ఈరోడ్డు నిర్మాణంతో ఆయా గ్రామాల స్థితిగతులు మెరుగుపడుతాయని ఆయన ఆశాభావం వ్యక్తం



చేశారు.పర్యావరణం పరిరక్షణ కోసం కోట్లాదిరూపాయాలు వెచ్చిస్తు చేపట్టనున్న హైవేరోడ్డు నిర్మాణంతో ఉపాధీ అవకాశాలు మెండుగా లభిస్తాయని అన్నారు. అనంతరం ప్రజల నుండి అర్జీలు స్వీకరించారు.స్థానిక బిట్-1 సచివాలయాని సందర్శించి రికార్డులు పరిశీలించారు.ప్రతి సచివాలయంలో విధిగా స్పందన కార్యక్రమాన్ని ఏర్పాటు చేయాలని నిర్వహణలో అలసత్వం వహించకుండా ప్రజలకు సిబ్బంది నిత్యం అందుబాటులో ఉండి వారి సమస్యలు సత్వరమే పరిష్కరించాలని అన్నారు.సచివాలయ సిబ్బందికి బయోమెట్రిక్ హాజర్ తప్పనిసరి అని సూచించారు.ఈకార్యక్రమంలో తహసిల్దారు తాజీయాబేగం,హేవే అదారిటి సిబ్బంది,కాలుష్య నియంత్రణ మండలి సిబ్బంది,విఆర్‌ఒలు, సర్వేయర్లు, తదితరులు పాల్గోన్నారు.

## పారిశుద్ధ్య సమస్యలపై దృష్టి సారించండి

**నెల్లూరు కార్పొరేషన్, డిసెంబరు 1, ప్రభాతవార్త:** డ్రైను కాలువల్లో పూడికతీత పనులు, మురుగు పారుదల చర్యలు, దోమల వ్యాప్తి నిర్మూలన వంటి వివిధ చర్యలపై ప్రత్యేక దృష్టి సారించి, పారిశుధ్య సమస్యలను పరిష్కరించాలని నగరపాలక సంస్థ కమిషనర్ డి.హరిత అధికారులను ఆదేశించారు. పారిశుధ్య నిర్వహణ పనుల పర్యవేక్షణలో భాగంగా స్థానిక 14వ డివిజన్ బాలాజీ నగర్‌లోని వివిధ ప్రాంతాల్లో గురువారం ఉదయం అధికారులతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా స్థానికంగా జరుగుతున్న పారిశుధ్య పనులను కమిషనర్ పర్యవేక్షించి అధికారులు, సిబ్బందికి వివిధ



సూచనలు జారీ చేశారు. డ్రైను కాలువల పూడిక తీత సిల్టును ఎప్పటికప్పుడు తొలగించి పరిసరాలను శుభ్రంగా ఉంచాలని, పందుల బెడద లేకుండా జాగ్రత్త చర్యలు తీసుకోవాలని అధికారులను కమిషనర్ ఆదేశించారు. డివిజనులో జరుగుతున్న వివిధ అభివృద్ధి పనులను పరిశీలించిన కమిషనర్ పనులను నాణ్యతతో వేగవంతంగా పూర్తి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో స్థానిక కార్పొరేటర్ కర్థం ప్రతాప్‌రెడ్డి, నగరపాలక సంస్థ ఇంజనీరింగ్ విభాగం ఎస్‌ఈ సంపత్‌కుమార్, హెల్త్ విభాగం అధికారి, శానిటరీ విభాగం సిబ్బంది, సచివాలయం కార్యదర్శులు పాల్గొన్నారు.

## వైఎస్‌ఆర్ అర్బన్ హెల్త్ క్లినిక్స్ నందు ఎల్‌జిఎస్ పోస్టులకు ఆహ్వానం

**నెల్లూరు అర్బన్, డిసెంబరు 1, ప్రభాతవార్త:** వైఎస్‌ఆర్ అర్బన్ హెల్త్ క్లినిక్స్ నందు ఎల్‌జిఎస్ పోస్టుల కొరకు మునుపు ఇచ్చిన నోటిఫికేషన్ నెం. 05/ఎన్‌హెచ్‌ఎం/2021 తేది 21.09.2021 భర్తీ కానటువంటి ఎల్‌జిఎస్ 3 పోస్టులు / ఎకనమికల్ వీకర్ సెక్షన్ కేటగిరి వారికి దరఖాస్తు చేసుకోవడానికి అవకాశం కల్పిస్తున్నామని జిల్లా ఉపాధి అధికారి ఎ.సురేష్‌కుమార్ తెలియజేశారు. పూర్తి చేసిన అప్లికేషన్‌లు జిల్లా ఉపాధి కార్యాలయం నందు 08.12.2022 గురువారం సాయంత్రం 5 లోగా అందజేయాల్సిందిగా ఎ.సురేష్‌కుమార్ తెలిపారు.

## ఎయిడ్స్ రహిత సమాజం కోసం కృషి చేయాలి

**నెల్లూరు డిసెంబర్ 1, ప్రభాతవార్త-వైద్యం** జిల్లావ్యాప్తంగా ఎయిడ్స్ కేసులు తగ్గుముఖం పట్టాయని, ప్రతి ఒక్కరూ ఎయిడ్స్ రహిత సమాజం కోసం అదే స్ఫూర్తితో పనిచేయాలని జిల్లా వైద్య ఆరోగ్యశాఖాధికారి ఎం.పెంచలయ్య పిలుపునిచ్చారు. గురువారం నగరంలోని గాంధీబొమ్మ కూడలిలో ప్రపంచ ఎయిడ్స్ దినోత్సవాన్ని పురస్కరించుకుని డిఎంహెచ్‌ఒ ఎయిడ్స్ అవగాహన ర్యాలీని నిర్వహించి, ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా పెంచలయ్య మాట్లాడుతూ మెరుగైన చికిత్స, సురక్షితమైన శృంగార పద్ధతులు, డిస్పోజబుల్ సిరంజిల వాడకం వల్ల ప్రపంచవ్యాప్తంగా ఎయిడ్స్



ఒకరి నుండి ఒకరికి వ్యాపించడం బాగా తగ్గిందని, తల్లి నుంచి బిడ్డకు ఎయిడ్స్ సోకకుండా వైద్యం అందిస్తున్నామన్నారు. దీంతో రోజురోజుకు ఎయిడ్స్ వ్యాధిగ్రస్తుల సంఖ్య తగ్గిందన్నారు. ప్రతి ఒక్కరు ఎయిడ్స్ సోకిన వారిపట్ల వివక్ష చూపకుండా ఆదరించాలన్నారు. ఈ వ్యాధికి ఎవరూ భయపడాల్సిన అవసరం లేదన్నారు. వైద్య ఆరోగ్యశాఖ ఆధ్వర్యంలో ఎయిడ్స్ వ్యాధిని జిల్లాట సమూలంగా పారద్రోలేందుకు అవసరమైన అన్ని చర్యలు చేపడుతున్నట్లు ఆయన వివరించారు. మొదట పిఎంపి అసోసియేషన్ ఆధ్వర్యంలో ఎయిడ్స్‌పై కళాజాత ద్వారా అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో జిల్లా టీడీ కంట్రోల్ అధికారి డాక్టర్ జి.వెంకటప్రసాద్, సెట్నెల్ సీఈఓ పుల్లయ్య, వైద్యులు, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు, విద్యార్థులు, వైద్య ఆరోగ్యశాఖ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

## జనాభాకు అనుగుణంగా ఓట్లు నమోదు చేయాలి

**నెల్లూరు కార్పొరేషన్, డిసెంబరు 1, ప్రభాతవార్త:** జిల్లాలో జనాభాకు తగ్గట్లుగా యువత ఓటర్లుగా నమోదు చేసేందుకు ఒక కార్యచరణ ప్రణాళిక రూపొందించామని జిల్లా కలెక్టర్ కె.వి.ఎన్.చక్రధర్‌బాబు కేంద్ర రాష్ట్ర ఎన్నికల ఉన్నతాధికారులకు తెలిపారు. గురువారం మధ్యాహ్నం ఢిల్లీ నుంచి కేంద్ర సీనియర్ ఉప ఎన్నికల కమిషనర్ ఎస్.హెచ్.నితేష్ వ్యాస్ రాష్ట్రవ్యాప్తంగా జిల్లా కలెక్టర్‌లతో ఓటర్ల జాబితా ప్రత్యేక సవరణ కార్యక్రమంపై వీడియో కాన్ఫిరెన్స్ నిర్వహించి జిల్లాల వారీగా సమీక్షించారు. ఈ సందర్భంగా ఓటర్లు - జనాభా నిష్పత్తి, కొత్త ఓటర్ల నమోదు, వివిధ క్లెయిముల పరిష్కారం గత ఓటర్ల జాబితాతో నేటి జాబితా పోలిక, యువ ఓటర్ల తగ్గుదలను భర్తీ చేసేందుకు తీసుకోవాల్సిన వ్యూహాలను ఉప ఎన్నికల కమిషనర్, రాష్ట్ర ముఖ్య ఎన్నికల అధికారి ముఖేష్‌కుమార్ మీనాతో కలిసి జిల్లా కలెక్టర్‌లతో చర్చించి వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్



కె.వి.ఎన్.చక్రధర్‌బాబు మాట్లాడుతూ జిల్లాలో జనాభాకు తగ్గట్టుగా 18 సంవత్సరాలు నిండిన యువతీ యువకులందరూ కూడా ఓటరుగా నమోదు చేసుకునే విధంగా పెద్ద ఎత్తున ఒక కార్యచరణ ప్రణాళిక ద్వారా ప్రక్రియ పూర్తి చేస్తామన్నారు. అలాగే నెల్లూరు నగరం, గ్రామీణ నియోజకవర్గాల్లో జనాభాకు తగ్గట్టుగా 60 వేల మంది ఓటర్లు నమోదు కాలేదని ఈ దిశగా ప్రత్యేక దృష్టి సారించి ప్రజలను చైతన్యపరచి అందరూ ఓటర్లుగా నవమోదు అయ్యేందుకు కృషి చేస్తామన్నారు. జిల్లాలో పెండింగులో ఉన్న 6, 7, 8 క్లెయిమ్ ఫారాలను నిర్ణీత గడవు లోగా పరిష్కరిస్తామన్నారు. బూత్ స్థాయి అధికారుల సేవలను ఇందుకోసం అన్ని విధాల వినియోగించుకుంటామన్నారు. వీడియో కాన్ఫిరెన్స్ అనంతరం జిల్లా కలెక్టర్ జిల్లాలోని ఎన్నికల అధికారులతో మాట్లాడుతూ అన్ని సచివాలయాల్లో ఉన్న జగనన్న విద్యా దీవెన డేటా వివరాలను సేకరించి 18 సంవత్సరాలు నిండిన యువతీ యువకులందరినీ ఓటరుగా నమోదు చేసుకునేందుకు ముమ్మరంగా చర్యలు చేపట్టాలన్నారు. 8వ తేదీలోగా అన్ని కళాశాలలు, విశ్వ విద్యాలయాల పరిధిలో యువతీ యువకులను చైతన్యపరచి పెద్ద ఎత్తున ఓటు నమోదు కార్యక్రమం చేపట్టాలన్నారు. రోజు వారి నివేదికను రాష్ట్ర ముఖ్య ఎన్నికల అధికారికి పంపాల్సి ఉంటుందని, అందుకు తగ్గట్టుగా ప్రత్యేక దృష్టి సారించి ఎప్పటికప్పుడు పురోగతి సాధించాలన్నారు. ఇప్పుడు తయారు చేస్తున్న ఓటర్ల జాబితా 2024 సంవత్సరం డిసెంబరు వరకు ప్రధాన ఓటర్ల జాబితా ఉంటుందని, అందువలన చాలా జాగ్రత్తగా జాబితా రూపొందించాల్సి ఉంటుందన్నారు. నగర కమిషనర్ డి.హరిత, నెల్లూరు, కావలి, ఆత్మకూరు ఆర్డీవోలు మలోల, శీనా నాయక్, కరుణ కుమారి, జెడ్పీ సీఈవో చిరంజీవి, తెలుగుగంగ ప్రాజెక్ట్ ప్రత్యేక కలెక్టర్ ఎం.వి.సుధాకర్, తహసీల్దారు నిర్మలానంద బాబా తదితరులు పాల్గొన్నారు.

## కుల్లూరులో ఎయిడ్స్‌పై అవగాహన



**కలువాయి డిసెంబర్ 1 ప్రభాతవార్త:** ప్రపంచ ఎయిడ్స్ దినోత్సవం సందర్భంగా మండలంలో కుల్లూరు ప్రభుత్వ జూనియర్ కళాశాల నందు గురువారం ఎయిడ్స్ పై అవగాహన కార్యక్రమాన్ని కళాశాల ప్రిన్సిపల్ భక్తవత్సలరెడ్డి ఆద్వర్యంలో నిర్వహించారు. ఈకార్యక్రమానికి స్దానిక ప్రభుత్వ వైద్యశాల డాక్టర్ శివప్రసాద్ ముఖ్య అతిధిగా పాల్గోన్నారు. ఈ సందర్భంగా ఫ్రిన్సిఫల్ భక్తవత్సల్‌రెడ్డి మాట్లాడుతు విద్యార్దులు ఎయిడ్స్ పై అవగాహన కలిగి ఉండి అంటువా ్యధి బారిన పడకుండా యువత రక్షించుకోవాలని తెలియజేశారు. విద్యార్ధులకు హెచ్ఐవి గురించి, ఎయిడ్స్ గురించి వివరించారు. ఎయిడ్స్ వ్యాధి వచ్చినట్లు అయితే ఎటువంటి మందులు లేవని నివారణ ఒక్కటే మార్గమని విద్యార్దులు ఈవిషయాలపట్ల అవగాహన కలిగి సమాజంలో అనేక మందికి అవగాహన కల్పించాలని డాక్టర్ శివ ప్రసాద్ తెలిపారు. అనంతరం గ్రామంలోని పలు వీధులలో విద్యార్దులు ర్యాలీ గా ఎయిడ్స్ పై నినాదాలు చేస్తు ర్యాలీ నిర్వహించారు. బస్టాండ్ కూడలిలో మానవహారాన్ని ఏర్పాటు చేశారు. ఈకార ్యక్రమంలో ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ కిషోర్, అద్యాపకులు కృష్ణా, కల్పన, సుప్రజ, రాణి, రామాంజనేయులు, శ్రీనివాసులు, సురేష్, అద్యాపకేతర సిబ్బంది వైద్యసిబ్బంది పాల్గోన్నారు.

## విద్యార్ధులకు ఎయిడ్స్‌పై అవగాహన



**గుడ్లూరు, డిసెంబరు 1, ప్రభాతవార్త :** మండలంలోని బసిరెడ్డిపల్లి హైస్కూల్ నందు ప్రపంచ ఎయిడ్స్ దినోత్సవం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిధిగా ఆరోగ్యఅధికారి డాక్టర్ మారుతిరావు పాల్గొని అవగాహన కల్పించారు. ఎయిడ్స్ అంటు వ్యాధి కాదని, అంటించుకునే వ్యాధి అని సూచించారు. హెచ్ఐవి వైరస్ వల్ల ఎయిడ్స్ వ్యాధి వస్తుందని, తగు జాగ్రత్తలు తీసుకోవడం ద్వారా ఎయిడ్స్ వ్యాప్తి నివారించగలమని అన్నారు. వివిధ రకాల వ్యాధులు, కారణాలు, నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి వివరించారు. ఈ కార్యక్రమంలో వైద్యాధికారిణి ప్రియదర్శిని, సీహెచ్ఓ భాస్కర్, వైద్య సిబ్బంది, సైన్స్ ఉపాధ్యాయులు కృష్ణయ్య, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## సింహాద్రిరావుకు ఉత్తమసేవా పురష్కారం



**బిట్రగుంట, డిశంబర్1, ప్రభాతవార్తః** బోగోలు మండలం ముంగమూరు భవాని ఎడ్యుకేషనల్ సోసైటి ఆదరణకేంద్రం వ్యవస్తాపక అధ్యక్షుడు కె.సింహాద్రిరావుకు ప్రపంచ ఎయిడ్స్‌డేను పురష్కరించుకొని రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ నెల్లూరు టౌన్‌లో నిర్వహించిన కార్యక్రమంలో ఎయిడ్స్ రోగులకు ఉత్తమసేవలందించినందుకు ఉత్తమసేవాపురష్కారాన్ని డి.ఎం.అండ్ హెచ్ఓ పెంచలయ్య మరియు జిల్లా ఎయిడ్స్ నోడల్ అధికారి వెంకటప్రసాద్ చేతుల మీదుగా అందజేశారు. ఈసందర్బంగా సింహాద్రిరావు మాట్లాడుతూ గత నాలుగు దశాబ్దాలుగా తాను ఎయిడ్స్ రోగులకు సేవలందిస్తున్నందుకు ఈపురష్కారం అందజేయడం పట్ల నాపై ఎంతో భాద్యత పెంచిందని ఆయన చెప్పారు ఈకార్యక్రమంలో పలువురు స్వశ్చంద సంస్తల ప్రతినిధులు పాల్గొన్నారు.

## ఈక్రాపు చేయించుకోండి



**వరికుంటపాడు, డిశంబర్1, ప్రభాతవార్తః** ఖరీఫ్ సీజనుకు సంబందించి వేసిన ప్రతి పంటకు రైతులు తప్పనిసరిగ ఈక్రాపు చేయించుకొని బౌతిక రసీదులు పొందాలని వరికుంటపాడు గ్రామ సర్పంచ్ కొండిపోగు దిలీప్ కుమార్ అన్నారు. గురువారం గ్రామ సచివాలయంలో రైతులకు ఖరీఫ్ పంట నమోదుకు సంబందించి బౌతిక రసీదులను అందజేశారు. ఈసందర్బంగా ఆయన మాట్లాడుతూ ఈక్రాఫ్ చేయించుకొని రసీదు పొందితేనే ప్రభుత్వంనుంచి ఎలాంటి రాయితీలనైనా పొందవచ్చన్నారు. అలాగే రైతులందరు తమతమ పంటలను అగ్రికల్చరల్ అసిస్టెంట్లద్వారా పంటలను ఈక్రాపు చేయించుకోవాలని సూచించారు. ఈకార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి శ్రీనివాసులు, వి.ఆర్.ఒ శేషారెడ్డి, వి.ఎ.ఎ చంద్రశేఖర్ ,రైతులు తదితరులు పాల్గొన్నారు.

## కోటంరెడ్డిని పరామర్శించిన బీద రవిచంద్ర దంపతులు



**నెల్లూరు డిసెంబర్ 1, ప్రభాతవార్త-వైద్యం:** ఇటీవల కాలంలో ఒక దుండగుడి చేతిలో దాడికి గురై అపోలో ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న తెలుగుదేశం పార్టీ నెల్లూరు నగర నియోజకవర్గ ఇన్‌చార్జ్ కోటంరెడ్డి.శ్రీనివాసులురెడ్డిని తెలుగుదేశం పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి బీద.రవిచంద్ర దంపతులు, వారితోపాటు నెల్లూరు పార్లమెంటు టీడీపీ అధ్యక్షుడు, నెల్లూరు రూరల్ నియోజకవర్గ ఇన్‌చార్జ్ అబ్దుల్‌అజీజ్‌లు గురువారం అపోలో ఆసుపత్రిలో పరామర్శించారు. వారి ఆరోగ్య వివరాలను అడిగి తెలుసుకున్నారు. త్వరితగతిన కోలుకుని ప్రజా క్షేత్రంలోకి రావాలని వారు ఆకాంక్షించారు.

## రెడ్‌క్రాస్ ఆధ్వర్యంలో ఎయిడ్ అవగాహన ర్యాలీ




**నెల్లూరు డిసెంబర్ 1, ప్రభాతవార్త-వైద్యం:** ప్రపంచ ఎయిడ్స్ దినోత్సవాన్ని పురస్కరించుకుని నెల్లూరు జిల్లా ఇండియన్ రెడ్‌క్రాస్ సంస్ధ, ఏపీఎస్ఏసీఎస్ సంయుక్త ఆధ్వర్యంలో నగరంలోని గాంధీబొమ్మ కూడలి నుంచి టౌన్‌హాలు వరకు ర్యాలీ నిర్వహించారు. ఈ ర్యాలీని జిల్లా వైద్య ఆరోగ్యశాఖాధికారి డాక్టర్ ఎం.పెంచలయ్య జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా రెడ్‌క్రాస్ వాలంటీర్లు, రెడ్‌క్రాస్ యూత్ విద్యార్థిని, విద్యార్థులు పాల్గొని అందరూ సమానమే అలే నినాదంతో ర్యాలీతో టౌన్‌హాలుకు చేరుకున్నారు. అనంతరం టౌన్‌హాలులో ఎయిడ్స్ వ్యాధిపై అవగాహన కార్యక్రమం చేపట్టారు. జరిగిన కార్యక్రమంలో రెడ్‌క్రాస్ సంస్ధకి ఏపీఎస్ఏసీఎస్ వారు మొమెంటోతో సత్కరించారు. ఈ సందర్భంగా ఎయిడ్స్ వ్యాధి ప్రబలకుండా యువత తగు జాగ్రత్తలు తీసుకోవాలని రెడ్‌క్రాస్ మేనేజింగ్ కమిటీ సభ్యుడు దాసరి.రాజేంద్రప్రసాద్ సూచించారు. ఈ కార్యక్రమంలో రెడ్‌క్రాస్ వైఆర్‌జి కేర్ యూనిట్ మారప్పన్, రమ్య. విజయలక్ష్మి, యామిని, అడ్మినిస్ట్రేటవ్ అధికారి చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

## విద్యార్ధులకు పరీక్షలపై అవగాహన



**ఉదయగిరి డిసెంబర్ 1 ప్రభాతవార్త:** ఉదయగిరి మండలంలోని వెంగళరావునగర్‌లో పదోతరగి విద్యార్దులకు రాత్రి 7 గంటల నుండి 9 గంటలమధ్య ఎస్ఎంసి చైర్మన్ ఆద్వర్యంలో హెచ్ఎం ఎస్ నూర్జహాన్ పర్యవేక్షణ జరిపారు. జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల వెంగరావునగర్ ప్రధానోపాధ్యాయురాలు పదోతరగతి విద్యార్దులు చదువుతున్నారో లేదో అని తనీఖి చేసేందుకు ఇంటింటికి వెళ్లారు. విద్యార్దులను ఇంటి వద్ద చక్కగా చదివించాలని వారిని పర్యవేక్షించాలని విద్యార్దుల తల్లిదంద్రులకు సూచించారు. ఈకార్యక్రమంలో ఉపాధ్యాయులు వెంగలరావు, నాగేశ్వరరావు, జ్యోతి శ్రీనివాసులు, శ్రీనివాస్, ఎస్ఎంసి చైర్మన్ లక్షమ్మ పాల్గోన్నారు.

## నీటి విడుదలను తగ్గించండి సారూ !

**చేజర్ల, డిసెంబర్1ప్రభాతవార్త:** సోమశిల దక్షిణ కాలువ పరిధిలోని 24ఎల్ ఉప కాలువలకు వచ్చే నీటి విడుదలను తగ్గించాలని అధికారులకు విన్నవించినా ఫలితం లేదని చేజర్ల మండలం పెరుమాళ్ళపాడు సర్పంచ్ తలపనేని నరసమ్మ వాపోయారు. సోమశిల జలాశయం నుంచి ఎక్కువగా నీరు వస్తుండడం వలన సాగుచేసి ఉన్న నారుమళ్ళు నీటి మునుగుతున్నాయని ఈ విషయాన్ని ఇరిగేషన్ ఎఇ వినయ్‌కుమార్ కు వినతిపత్రం ఇచ్చినా స్పందించడం లేదని ప్రస్తుతం తమకు నీరు అవసరం లేదని విన్నవించుకున్నామని, విడుదల చేసే నీటిలో కొద్దిపాటి నీటినే విడుదల చేయాలని సంబంధిత అధికారులకు తెలియజేసినా పట్టించుకోవడం లేదన్నారు. గొల్లపల్లి , పుట్టుపల్లి, పెరుమాళ్ళపాడు గ్రామాల్లోని రైతులకు 24ఎల్ ద్వారా విడుదల చేసే నీటిని తగ్గించి నారుమడులు పాడవకుండా చూడాలని సంబంధింత అధికారులు స్పందించి తగు చర్యలు తీసుకోవాలని ఆమె కోరారు.

## గురుకుల పాఠశాలలో అవస్దలు వర్ణాతీతం



**ఉదయగిరి డిసెంబర్ 1 ప్రభాతవార్త:** ఉదయగిరి మండలంలోని గురుకుల పాఠశాలలో విద్యార్దులు బోజనం చేయడానికి సరైన బోజన వసతి గృహం లేక తీవ్ర ఇబ్బందులకు గురౌతున్నారు. ఉన్నత పాతభవనంశిధిలావస్దులో ఉండగా లోపల కూర్చోని బోజనం చేసే అవకాశం లేక ఆరుబయట కూర్చున వారి మీదువర్షం పడుతుతీవ్ర ఇబ్బందికి గురౌతున్నారు. అలాగే త్రాగడానికి ఆర్ఒ వాటర్‌ప్లాంట్ లేక నిలువ వుంచిన నీటిని త్రాగుతు అప్పుడప్పుడు అనారోగ్యానికి గురౌతున్నారు. జగనన్న గోరుమద్దులో భాగంగా కోట్ల రూపాయాలు ఖర్చు చేస్తున్న ప్రభుత్వం విద్యార్దులకు కూర్చోని తినడానికి సరైన భవనం నేరి ్మంచాలని అలాగే వాళ్ళు అనారోగ్యం పాలు కాకుండా సురక్షిత మంచినీటి సదుపాయం కల్పించాలని విద్యార్దుల తల్లిదండ్రులు, పాఠశాల సిబ్బంది ప్రిన్సిఫల్ మురళీకృష్ణా కోరారు.

## క్వారీ పేలుళ్ళ శబ్దాలతో వ్యాధుల పాలవుతున్న ప్రజలు




**కావలి, డిసెంబరు 1 ప్రభాతవార్త:** జలదంకి మండలంలో క్వారీ పేలుళ్ళ శబ్దాలతో ప్రజలు వ్యాధులకు గురై భయానక వాతావరణంలో తల్లడిల్లిపోతున్నారని గట్టుపల్లి ఉపసర్పంచ్ గుమ్మలంపాటి సుబ్బారావు తెలిపారు. గురువారం కావలి జర్నలిస్ట్ క్లబ్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. క్వారీ పేలుళ్ళ వల్ల గ్రామాలలో భయానక వాతావరణం నెలకొనిందని, చుట్టు పక్కల ఇళ్లు నెర్రులు వస్తున్నాయని తాను అధికారులకు ఫిర్యాదు చేయడం జరిగిందన్నారు. జిల్లా కలెక్టర్‌కు స్పందనలో అర్జీ ఇవ్వడం జరిగిందన్నారు. కలిగిరి సర్కిల్ ఇన్స్‌పెక్టర్‌కు కూడా ఫిర్యాదు చేయడం జరిగిందన్నారు. గత 20 సంవత్సరాల నుండి అన్నవరం క్వారీతో అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నామన్నారు. క్రషింగ్ చేసిన స్టోన్ పౌడర్ వల్ల చుట్టు పక్కల రైతుల పంటలు పండటం లేదన్నారు. బ్లాస్టింగ్ వల్ల చుట్టుపక్కల గ్రామాల్లోని అన్నవరం, చింతలపాళెం ఇళ్ల గోడలు పగుళ్లు ఇచ్చాయన్నారు. ఈ శబ్దాలకు బిపి, పక్షవాతం, గుండెపోట్లు వచ్చి చనిపోతున్నారన్నారు. ప్రజల్ని కాపాడాలంటూ ఉపసర్పంచ్ హోదాలో వివిధ శాఖల అధికారులకు ఫిర్యాదు చేసినందుకు వైసిపి నేత గొట్టిపాటి ప్రసాద్‌నాయుడు బెదిరింపులకు దిగాడన్నారు. కారుతో గుద్ది హత్య చేస్తాడన్నారు. ఈ బెదిరింపులపై పోలీస్ అధికారులకు ఫిర్యాదు కూడా చేయడం జరిగిందన్నారు. తనకు గొట్టిపాటి ప్రసాద్‌నాయుడు, మరికొంత మంది వల్ల ప్రాణహాని వుందని పోలీసులు రక్షణ కల్పించాలని ఆయన విజ్ఞప్తి చేశారు. తనకు రక్షణ కల్పిస్తూ అధికారులు సమస్యలు పరిష్కరించకపోతే ధర్నాలు, రిలేదీక్షలు చేపడతామన్నారు. ఈ సమావేశంలో గొట్టిపాటి మస్తానయ్య పాల్గొని మాట్లాడారు.

## ఆశానికేతన్ హెచ్ఐవి కేంద్రంలో దుప్పట్లు పంపిణీ

**కావలి రూరల్, డిసెంబరు 1 ప్రభాతవార్త:** ప్రపంచ ఎయిడ్స్ దినోత్సవం సందర్భంగా గురువారం కావలి రూరల్ మండలం తాళ్ళపాళెం ఆశానికేతన్ హెచ్ఐవి కేంద్రంలో రాష్ట్ర ప్రభుత్వ పెన్షనర్స్ సంఘం బాధ్యులు దుప్పట్లు, పండ్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ప్రభుత్వ పెన్షనర్స్ సంఘం అధ్యక్షులు ఆకుల రమణయ్య, సభ్యులు పి.రవికుమార్, సాయిరాంసింగ్, మేపూరు వెంకయ్య, నరహరి వెంకటేశ్వరరావు తదితరులు బాధితులకు దుప్పట్లు, పండ్లు అందజేసి మాట్లాడారు. ఆశానికేతన్‌లో వున్న వారంతా ఆరోగ్యవంతంగా వుండి శ్రద్ధగా చదువుకొని ప్రయోజకులై ఆనందంగా జీవనం సాగించాలని కోరారు.

## కావలి వాసవీ వనితా లెజండ్స్ సేవలు అభినందనీయం



**కావలి, డిసెంబరు 1 ప్రభాతవార్త:** కావలి వాసవీ వనితా క్లబ్ లెజండ్స్ అధ్యక్షురాలు అనుమాలశెట్టి కామాక్షి నాయకత్వంలో నిర్వహిస్తున్న సేవా కార్యక్రమాలు ఎంతైనా అభినందనీయమని వాసవీ క్లబ్ గవర్నర్ బండారు శబరీష్ గుప్తా తెలిపారు. కావలి కన్యకా పరమేశ్వరి ఆలయంలో గవర్నర్ శబరీష్ గుప్తాకు మహిళలు భారీ స్వాగతం పలికారు. ఆయనను సత్కరించారు. ఆయన పర్యటనను పురస్కరించుకొని అమ్మవారి ఆలయంలో విశేష పూజలు నిర్వహించారు. పలు ఆలయాలలో భక్తులు కూర్చునేందుకు సిమెంటు బల్లల్ని వితరణ చేశారు. మున్సిపల్ కార్మికులకు బట్టలు, నిత్యావసర వస్తువులు, భోజన ం అందజేశారు. మథర్ థెరిస్సా స్కూల్ ఫర్ బ్లైండ్ పాఠశాలలో పిల్లలకు బట్టలు, దుప్పట్లు, మ్యాట్స్, నిత్యావసర వస్తువులు, స్టేషనరీ, స్నాక్స్, భోజనం ఏర్పాటు చేశారు. అనంతరం మొక్కల వితరణ కార్యక్రమాన్ని కూడా నిర్వహించారు. ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమంలో ఈ క్లబ్ గవర్నర్ శబరీష్ గుప్తా మాట్లాడారు. వనితలు వంటింటికే పరిమితం కాకుండా కుటుంబ అభివృద్ధి కోసం పాటుపడుతూ సేవా కార్యక్రమాలలో తమవంతు పాత్ర పోషించాలన్నారు. ప్రజా సేవకు పెద్దపీట వేయాలన్నారు. ఈ కార్యక్రమంలో కార్యదర్శి ఇన్నమూరి హేమలత, మాజీ మున్సిపల్ కౌన్సిలర్, ట్రజరర్ అమరా విజయలక్ష్మి, తదితరులు పాల్గొన్నారు.

## ఎయిడ్స్ బాధితులకు 'నలంద' వస్తువులు పంపిణీ

**కావలి, డిసెంబరు 1 ప్రభాతవార్త:** కావలి పట్టణ గాయత్రినగర్‌లోని నలంద ఇంగ్లీషు మీడియం హైస్కూలు, జూనియర్ కళాశాల ఆవరణలో గురువారం ఎయిడ్స్ బాధితులకు బట్టలు, నిత్యావసర వస్తువులు, పండ్లు, నగదును ఈ విద్యాసంస్థల చైర్మన్ యం.డి.మజహర్ అందజేశారు. నలంద విద్యాసంస్థల ఆవరణలో ఎయిడ్స్‌పై అవగాహన సదస్సు జరిగింది. ఈ సదస్సులో తాళ్ళపాళెం ఆశానికేతన్ ఎయిడ్స్ నిర్వాహకురాలు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ఎయిడ్స్ బాధితులకు ఈ వస్తువులు అందజేశారు. నలంద విద్యాసంస్థల చైర్మన్ యం.డి.మజహర్ దాతృత్వాన్ని ఆశానికేతన్ నిర్వాహకులు కొనియాడారు. ఈ కార్యక్రమంలో ఆశానికేతన్ నిర్వాహకులు సిస్టర్ మేరి, సిస్టర్ జినోవా, విద్యాసంస్థల డైరెక్టర్ యం.డి.ఫహీమ్, ప్రిన్సిపాల్ ఎస్.కె.జిలానీబాషా, పాఠశాల ప్రిన్సిపాల్ జ్యోత్స, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## ఎంఎస్ఆర్ డిగ్రీ కళాశాలలో మాగుంట వర్దంతి వేడుకలు



**కావలి, డిసెంబరు 1 ప్రభాతవార్త:** కావలి పట్టణంలోని ఎంఎస్ఆర్ డిగ్రీ కళాశాలలో మాజీ ఎంపి, ఎంఎస్ఆర్ డిగ్రీ కళాశాల వ్యవస్థాపకులు దివంగత మాగుంట సుబ్బరామిరెడ్డి 27వ వర్ధంతి వేడుకలు, ప్రపంచ ఎయిడ్స్ దినోత్సవ కార్యక్రమాలు గురువారం నిర్వహించారు. మెగా రక్తదాన శిబిరాన్ని ఏర్పాటు చేశారు. సుబ్బరామిరెడ్డి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమంలో కళాశాల కరస్పాండెంట్ గుంటుపల్లి రాజ్‌కుమార్ చౌదరి మాట్లాడారు. దాహార్తి దాత, విద్యాదాత, సేవాతత్పరుడు మాగుంట సుబ్బరామిరెడ్డిని స్మరించుకోవాలన్నారు. ప్రతి ఏట ఆయన వర్ధంతికి రక్తదాన శిబిరం నిర్వహిస్తున్నామన్నారు. 2000 సంవత్సరం నుండి క్రమం తప్పకుండా ఇప్పటి వరకు ప్రతి ఏట రక్తదాన శిబిరాలు, రక్తదానంపై అవగాహన, ఆవశ్యకత కార్యక్రమాలు నిర్వహిస్తున్నామన్నారు. విద్యార్థులకు మాగుంట గొప్పతనాన్ని తెలియజేస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ ఉమ, వైస్ ప్రిన్సిపాల్ కిరణ్, అధ్యాపకులు, విద్యార్థులు, సిబ్బంది పాల్గొన్నారు.

## మాగుంటకు కనకట్ల ఘన నివాళి



**నెల్లూరు టౌన్, డిసెంబరు 1, ప్రభాతవార్త:** ఒంగోలు పార్లమెంటు సభ్యులు స్వర్గీయ మాగుంట సుబ్బరామిరెడ్డి వర్ధంతి సందర్భంగా గురువారం నెల్లూరు నగరంలోని ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి కేంద్ర అగ్రికల్చర్ మాజీ డైరెక్టర్ కనకట్ల రఘురాం ముదిరాజ్ ఘనంగా నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా రఘురామ్ ముదిరాజ్ మాట్లాడుతూ మాగుంట సుబ్బరామిరెడ్డి చాలా సౌమ్యులని రాజకీయాల్లో ఉన్నత భావాలు కలిగిన నాయకుడని, అందరి వారుగా గుర్తింపు పొందారని, అలాంటి నేత మన మధ్య లేకపోవడం విచారకరమని ఆవేదన వ్యక్తం చేశారు. ఎన్‌జీవోస్ మాజీ అధ్యక్షులు దద్దోలు రమణయ్యగౌడ్, ప్రభుత్వ విశ్రాంతి ఉద్యోగులు కనకరాజు, కె.గోపాల్, బీసీ నేత పుష్పరాజ్ తదితరులు ఈ కార్యక్రమంలో పాల్గొని మాగుంట విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు.

## శిక్షణా తరగతులు



**నెల్లూరు అర్భన్, డిసెంబరు 1, ప్రభాతవార్త:** నెల్లూరు ఐఐటీటీఎం కాలేజ్‌లో టూర్ మేనేజర్ శిక్షణ తరగతులు జరుగుతున్నాయి. ఈ కార్యక్రమంలో భాగంగా జిల్లా ఉపాధి అధికారి ఎ.సురేష్‌కుమార్ 30 మంది విద్యార్థులతో క్లాస్‌లు తీసుకోవడం జరిగింది. బుధవారం ఐఐటీటీఎం కాలేజ్‌లో ఆయన వెళ్లి శిక్షణ ఇచ్చారు. ఈ శిక్షణ మొత్తం 130 రోజులు ఉంటుందని, 02.11.2022 నుంచి 13.04.2023 వరకు ఉంటుందని తెలిపారు. ఇప్పటికే 25 రోజులు పూర్తి చేసుకున్నట్లు కోర్సు ఇన్‌చార్జ్ ఎ.సురేష్‌కుమార్ తెలిపారు. వీరితో పాటు జిల్లా స్కిల్ డెవలప్‌మెంట్ అధికారి వీణిల్‌కుమార్ పాల్గొన్నారు.

## 59వ రోజుకు చేరిన గడపగడపకు మన ప్రభుత్వం



**బిట్రగుంట, డిసెంబరు 1 ప్రభాతవార్త** కావలి నియోజకవర్గంలో గడపగడపకు మన ప్రభుత్వ కార్యక్రమంలో భాగంగా 59వ రోజు గురువారం బోగోలు బిట్-3లో ఇంటింటికి వెళ్లి వైసిపి ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాల వివరాల కరపత్రాల్ని కావలి ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డి పంపిణీ చేశారు. ఈ సందర్బంగా ఆయన మాట్లాడుతూ అవినీతి, లంచాలకు తావులేకుండా అర్హులైన ప్రతి ఒక్కరికి పారదర్శకంగా పథకాలు అమలు చేస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో వైసిపి మండల అధ్యక్షుడు మద్దిబోయిన వీరరఘు, ఎంపిపి మేకల సుజాత, జెడ్పీటీసీ మద్దిబోయిన కీర్తన, ఎంపిడివో ఆర్.గోవిందరావు, తహశీల్దార్ లక్ష్మీనారాయణ, వైసిపి నేత మేకల శ్రీనివాసులు, ప్రజాప్రతినిధులు, అధికారులు పాల్గొన్నారు.

## ఆదరణ కేంద్రంలో ఆర్ఎస్ఆర్ విద్యార్థులు వితరణ

**బిట్రగుంట, డిసెంబరు 1 ప్రభాతవార్త** బోగోలు మండలం ముంగమూరు భవానీ ఎడ్యుకేషనల్ సొసైటీ ఆదరణ కేంద్రంలో ఎయిడ్స్‌డేని పురస్కరించుకొని గురువారం ఆర్ఎస్ఆర్ ఇంజనీరింగ్ కళాశాల విద్యార్థులు ఫలసరుకులు, పండ్లు, బిస్కెట్లు అందజేసినట్లు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ టి.వి.యన్.రెడ్డి, డైరెక్టర్ రాజారెడ్డిలు తెలిపారు. తమ విద్యార్థులు తరచు అదరణ కేంద్రానికి వచ్చి పుట్టిన రోజు వంటి కార్యక్రమాలలో సేవలు చేయడం సంతోషకరమన్నారు. ఈ కార్యక్రమంలో కళాశాల ఎన్ఎస్ఎస్ సమన్వయకర్త కిరణ్‌కుమార్, ఆదరణ కేంద్ర డైరెక్టర్ కె.సింహాద్రిరావు, తదితరులు పాల్గొన్నారు.

## ఎయిడ్స్‌పై అవగాహన ర్యాలీ




**బిట్రగుంట, డిసెంబరు 1 ప్రభాతవార్త** బిట్రగుంట ప్రభుత్వ జూనియర్ కళాశాల నందు ప్రపంచ ఎయిడ్స్‌డే సందర్బంగా కోవూరుపల్లి పిహెచ్‌సి పరిధిలో ర్యాలీ నిర్వహించారు. ఈ ర్యాలీలో డిప్యూటీ డియం ఆండ్‌హెచ్‌వో డాక్టర్ బ్రిజిత మాట్లాడుతూ పిల్లలకు ఎయిడ్స్ వ్యాధిపై అవగాహన కల్పిస్తూ ఎయిడ్స్ రహిత సమాజాన్ని నిర్మించాలని కోరారు. ఈ కార్యక్రమంలో రక్త పరీక్షలు నిర్వహించారు. ఈ ర్యాలీలో కోవూరుపల్లి పిహెచ్‌సి వైద్యాధికారిణి డాక్టర్ సీమాతబాసు, వైద్య సిబ్బంది, కళాశాల విద్యార్థులు పాల్గొన్నారు.

## హాస్టల్‌కు వెళ్లే మార్గం దుస్థితిపై తహాశీల్దార్‌కు ఫిర్యాదు



**బిట్రగుంట, డిసెంబరు 1 ప్రభాతవార్త** బోగోలు మండలం విశ్వనాధరావుపేట పంచాయతీ పరిధిలోని రామస్వామిపాళెంలో వున్న ఎస్సీ బాలుర వసతి గృహానికి దారి లేక ఇబ్బందులు పడుతున్న వైనాన్ని జైభీమ్ అంబేద్కర్ సేవాదళ్ అధ్యక్షులు బత్తుల రవిచంద్ర గురువారం తహాశీల్దార్ లక్ష్మీనారాయణకుఫిర్యాదు చేశారు. వర్షం కురిసి పది రోజులైనా ఇంకా నీరు వుండి దుర్గంధంగా వుందని ఆయన దృష్టికి తీసుకొచ్చారు. ఆ ప్రాంతాన్ని పరిశీలించి సంబంధిత ఉన్నతాధికారులకు నివేదిస్తామని తహాశీల్దార్ హామీ ఇచ్చారని ఆయన తెలిపారు.

## అధికారుల సమన్వయలోపంతో అభివృద్ధి కుంటుపడుతుంది



**కలిగిరి, డిశెంబర్ 1, ప్రభాతవార్త;** అధికారుల సమన్వయ లోపంవల్లే కలిగిరి మండలంలో సమస్యలు పెరుగుతున్నాయని మండలాధ్యక్షురాలు మెట్టుకూరు శిరీషారెడ్డి ఆరోపించారు. గురువారం కలిగిరి మండల సర్వ సభ్య సమావేశం కలిగిరి యంపిడిఓ కార్యాలయంలో యంపిడిఓ కళాదర్‌రావు అధ్యక్షతన జరగగా యంపిపి ముఖ్యఅతిదిగా పాల్గ న్నారు. ఈసందర్బంగా జరిగిన సమావేశంలో పలు అబివృద్ధి కార్యక్రమాలపై అధికారులు సమావేశంలో తెలియ జేశారు. గృహనిర్మాణాలకు సంభందించి ఎఇ మాట్లాడుతూ కలిగిరి మండలం నుడాపరిదిలో కలిసిందన్నారు. ప్రభుత్వం లబ్ధిదారులకు ఇచ్చిన ఇంటి నివేశన స్తలాలకు సంభందించి ఇప్ప టివరకూ1172రిజిస్ట్రేషన్లు పూర్తిచేయడం జరిగిందన్నారు. ఉపాది హామీ పథకంపై ఏపిఓమాట్లాడుతూ కూలీల పని అవసరమైనచోట్ల పనులు కల్పిస్తున్నామన్నారు. అయినా మండలంలో ఉపాదిహామీ ప్రోగ్రస్ పరంగా చివరి స్తానంలో ఉందన్నారు. దీనిపై కల్పించుకున్న రావులకొల్లు సర్పంచి, పెద్దకొండూరు, గంగిరెడ్డిపాళెం సర్పంచిలు గ్రామాలలో సర్పంచిలకు తెలియకుండా ఏపిఓ గ్రామసభలు నిర్వహిస్తున్నాడని, ఇదేనా సర్పంచిలకు, ప్రజాప్రతినిదులకు అధికారులు ఇచ్చే గౌరవం అంటూ ఆవేదన వ్యక్తం చేశారు. పెద్దకొండూరులో గ్రామసభలు పెట్టినా సర్పంచికిగానీ వార్డుసభ్యులకు కానీ తెలియకుండా సభలు నిర్వహించడం ఏమిటని ప్రశ్నించారు. రావులకొల్లులో సర్పంచికి తెలియకుండా గ్రామసభలు నిర్వంచి అదికారులు ఇష్టమొచ్చినట్లు వ్యవహరిస్తున్నారన్నారు. మండలంలో సర్పంచిలకు, యంపిటీసీ సభ్యులకు విలువలు లేవని మండల జన రల్ బాడీ సమావేశానికి సైతం వాట్సప్ మెసేజీలు పెట్టి చేతులు దులుపుకుంటున్నారన్నారు. దీనిపై ఏపిఓ సమాదానమిస్తూ ఉపాది పథకంలో కొందరు సర్పంచిలు సహకరించడంలేదన్నారు. గడపగడపకూ మనప్రభుత్వం కార్యక్రమంలో ఉపాదికూలీలు తమకు కూలిపనులు లేవని యంఎల దృష్టికి తేవడం యంఎల్ఏ ఆదేశాల మేరకే గ్రామాలలో కూలీలకు ఉపాదిపనులు ఏర్పాటు చేయ డం జరిగిందన్నారు. కొన్ని పంచాయితీలలో నాయకుల పంతాలకు పోయి మన స్పర్ధలవల్ల బిల్లులు కాలేదన్నా రు. ఈ క్రమంలో వైసిపి, టిడిపి సర్పం చిలమద్య కొంత గలాటా చోటుచేసుకుం ది. టిడిపి వారికి ఈమండలంలో అధికారులు పనులు చేయడంలేదని ఆరోపించగా టిడిపి పాలనలోకూడా అధేజరిగిందని కుడుముల దిన్నిపాడు పిఏసియస్ అధ్యక్షులు ప్రత్యా రోపణలు చేశారు. దీనిపై స్పందించిన యంపిపి ఈ మండలంలో అధికారులు ఎవరికి వారుగా వ్యవ హరిస్తున్నారన్నారు. రాష్ట్రంలో ముఖ్యమంత్రి అభివృద్ధి పార్టీలకతీతంగా జరగాలని కోరుకుంటుంటే ఇక్క డమాత్రం అధికారులు సహకరించడంలేదన్నా రు. ఇలా ఉంటే అబివృద్ధి ఎలా జరుగుతుందన్నారు. ప్రతి సమావేశంలోనూ చెబుతున్నా అధికారుల్లో మార్పు రావడం లేదన్నారు. ప్రజాప్రతినిదులతో అధికారులు సమన్వయం చేసుకొని మండలాన్ని అబివృద్ధి పదంవైపు నడిపిం చాలని తెలిపారు. కాగా గురువారం జరిగిన మండల సర్వసభ్య సమావేశంలో తెలుగుదేశంపార్టీ సర్పంచిలు అధికారులు తమకు సహకరించడంలేదని నిరసనలో సభపూర్తయ్యే వరకూ కుర్చీలు వదిలి నేలపై కూర్చొని తమ నిరసన వ్యక్తం చేశారు. ఈకార్యక్రమంలో మండలంలోని అన్నిశాఖలు అధికారులు ఉపా ధ్యక్షురాలు పాల్గొన్నారు.

## బదిలీపై వెళ్ళిన ఉపాధ్యాయునికి ఘన సన్మానం




**మర్రిపాడు, డిసెంబర్1ప్రభాతవార్త:** మర్రిపాడు మండలం చుంచులూరు ఉన్నతపాఠశాలలో తెలుగు ఉపాధ్యాయుడిగా పనిచేసి దుత్తలూరు ఉన్నతపాఠశాలకు బదిలీపై వెళ్ళిన షేక్ ఖాజాపీర్‌ను పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు, గ్రామస్తులు గురువారం ఘనంగా సన్మానించారు. ఈసందర్భంగా పాఠశాల ప్రధానోపాధ్యాయుడు రమేష్ మాట్లాడుతూ ఖాజాపీర్ ఉత్తమ బోధనకు, ఉన్నత వ్యక్తిత్వానికి , విలువలకు, మంచితనానికి మారుపేరన్నారు. పాఠశాల అభివృద్ధికి, విద్యార్థుల అభ్యున్నతికి ఎంతగానో కృషి చేశారని కొనియాడారు. విశ్రాంత మండల విద్యాశాఖాధికారి జొన్నా సత్యనారాయణ మాటాల్డుతూ ఎంతో నిబద్ధతతో , అంకితభావంతో పనిచేసి బదిలీపై వెళ్ళిన ఇలాంటి ఉపాధ్యాయులను సత్కరించడం మంచి సంప్రదాయమన్నారు. ఈకార్యక్రమంలో పాఠశాల యాజమాన్య కమిటీ చైర్మెన్ విష్ణుకుమార్‌రెడ్డి, రిటైర్డ్ ఉపాధ్యాయురాలు అరుణ, కలిశెట్టి రాజేంద్రకుమార్, సునీత , పాఠశాల ఉపాధ్యాయులు అశోక్ , రేవతి, వెంకటరెడ్డి, రబ్బానిబాషా, మాధవరావ్, ఖాజారసూల్, పద్మ ,విద్యార్థులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

## సింగపేట సచివాలయాన్ని తనిఖీ చేసిన డిఎల్‌డివో



**అల్లూరు, డిసెంబరు 1 ప్రభాతవార్త** అల్లూరు నగర పంచాయతీ పరిధిలోని సింగపేట సచివాలయాన్ని గురువారం డివిజనల్ లెవల్ డెవలప్‌మెంట్ ఆఫీసర్ కనకదుర్గాభవానీ ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్బంగా సచివాలయ సిబ్బంది నుద్దేశించి ఆమె మాట్లాడారు. సచివాలయ సిబ్బందికి, వాలంటీర్లకు ఆయుష్మాన్ భారత్ కార్డుల రిజిస్ట్రేషన్, సర్వీస్ రిక్వెస్టులుపెంపు, హౌసింగ్, సమయపాలన తదితర అంశాలపై తగు ఆదేశాలు జారీ చేశారు. ఈ కార్యక్రమంలో ఎంపిడివో శ్రీదేవి, కమిషనర్ పణికుమార్, సింగపేట సచివాలయ సిబ్బంది, వాలంటీర్లు పాల్గొన్నారు.

## డిఎస్ఆర్ ట్రస్ట్‌లో పేదలకు దుప్పట్లు పంపిణీ



**అల్లూరు, డిసెంబరు 1 ప్రభాతవార్త** అల్లూరు నగర పంచాయతీ పరిధిలోని దేవిరెడ్డి శారద ఛారిటబుల్ ట్రస్ట్ నందు గురువారం పేదలకు దుప్పట్లు పంపిణీ కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ కార్యక్రమంలో ట్రస్ట్ సభ్యులు దేవిరెడ్డి దశరధరామిరెడ్డి మాట్లాడుతూ మా తల్లిదండ్రులు స్వర్గీయ దేవిరెడ్డి సుబ్బరామిరెడ్డి, బుజ్జమ్మ జ్ఞాపకార్థం ట్రస్ట్‌లో పేదలకు దుప్పట్ల పంపిణీ కార్యక్రమాన్ని నిర్వహించామన్నారు. ప్రతి సంవత్సరం మా తల్లిదండ్రుల జ్ఞాపకార్థం ఏదో ఒక కార్యక్రమం నిర్వహిస్తుంటామని తెలిపారు. సుమారు 400 మందికి ఈ రోజు దుప్పట్లు పంపిణీ చేయడం జరిగిందన్నారు. ఈ ట్రస్ట్ నందు సేవలను మరింత విస్తృతం చేస్తామన్నారు. అనంతరం అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ట్రస్ట్ అడ్మిన్ మేనేజర్ అనిల్‌కుమార్‌రెడ్డి, స్కిల్ డెవలప్‌మెంట్ ఇన్‌చార్జ్ రామచంద్రరావు, పెంచలబాబు, సుధాకర్, మేడా పెంచలరెడ్డి, నీలపురెడ్డి దశరధరామిరెడ్డి, మిట్టా నరసారెడ్డి, ట్రస్ట్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## ఉరివేసుకొని మహిళ ఆత్మహత్య



**పొదలకూరు డిసెంబర్ 1 ప్రభాతవార్త** మండలంలోని విరువూరు గ్రామంలో కుటుంబ కలహాలతో ప్రశాంతి అనే మహిళ చీరతో ఉరివేసుకోని ఆత్మహత్యకు పాలుపడినట్లు గురువారం పొదలకూరు పోలీసులకు ఫిర్యాదు అందింది ఈ కేసు విషయమై ఎస్ఐ కరిముల్లా మాట్లాడుతు మృతి చెందిన మహిళ భర్త మదా ్యనికి బానసై కుటుంబాన్ని పట్టిం చుకోకుండా ఉండడంతో విరువురు మద్య విబేదాలు తలెత్తడం మన స్తాపానికి గురై ఆత్మహత్య చేసుకున్నట్లు పోలీసులు తెలిపారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ ఖరిముల్లా తెలిపారు.

## రక్తదానం ప్రాణదానంతో సమానం



**పొదలకూరు డిసెంబర్ 1 ప్రభాతవార్త** రక్తదానం ప్రాణదానంతో సమానమని బిఎస్ఆర్ జడ్పి ఉన్నత పాఠశాల ప్రదానోపాద్యాయులు సనత్ కుమార్ ,నోవో బ్లండ్ బ్యాంకు అడ్మినిస్టేటర్ మోపూరు బాస్కర్‌నాయుడు పేర్కున్నారు. గురువారం పట్టణంలోని కాకతీయ డిగ్రీ కళాశాలలో ప్రపంచ ఎయిడ్స్‌డేని పురస్కరించుకొని రక్తదాన శిబిరం నిర్వహించారు. ఈ సందర్బంగా వారు మాట్లాడుతు ఒక్కసారి రక్తదానం చేస్తే ముగ్గురు ప్రాణాలు కాపాడినట్టేనని అన్నారు. రక్తంలోని పదార్థాలను మూడుగా విభజించి వేరువేరు అవసరాలకు వాడుకోవచ్చునని తెలియజేశారు. రక్తదానం అనేది మానవతా విలువలతో కూడిన గొప్ప పని అని అన్నా రు. కాకతీయ విద్యాసంస్థల కరస్పాండెంట్ సంఘన శివశంకర్‌రెడ్డి, ఫ్రిన్సిఫల్ షేక్ రఫీ, సిహెచ్ వేణుగోపాల్‌రెడ్డి, బ్లడ్ బ్యాంకు స్టాప్‌నర్స్ బినామౌల్, హెల్పింగ్ హ్యాండ్ సొసైటీ అద్యక్షులు విజయ్‌బాస్కర్, ఇమ్రాన్, మాధవి, అద్యాపకుల విద్యార్డులు పాల్గోన్నారు.

## ఆకట్టుకున్న ర్యాలీ




**కోవూరు, డిసెంబరు 1 ప్రభాతవార్త :** ఎయిడ్స్ వ్యాధిపై ప్రతి ఒకకరూ పూర్తిస్థాయిలో అవగాహన పెంచుకోవాలని సీనియర్ సివిల్ జడ్జి సి. మురళీధర్ అన్నారు. కోవూరు మండలం ఇనమడుగు ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో గురువారం ప్రపంచ ఎయిడ్స్ దినోత్సవాన్ని పురస్కరించుకుని ప్రజల్లో అవగాహర కోసం ర్యాలీ కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గతంలో పోలిస్తే ప్రస్తుతం ఈ వ్యాధి తగ్గుముఖం పట్టిందిన్నారు. అయినా కూడా ఈ వ్యాధి పట్ల ప్రతి ఒక్కరూ అవగాహన పెంచుకోవాల్సిన అవసరం ఉందన్నారు. అనంతరం ఇనమడుగు పురవీధుల్లో ఈ ర్యాలీ కార్యక్రమం కొనసాగింది. ఈ కార్యక్రమంలో ఇనమడుగు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యులు, డాక్టర్ ఇర్ఫాన్, డాక్టర్ రవిబాబు, న్యాయవాది రాంబాబు, సబ్‌యూనిట్ అధికారి సుధాకర్‌రెడ్డి, సూపర్‌వైజర్లు దిలీప్, శ్రీధర్, శ్రీనివాసులు, ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ పి. ప్రసాద్‌రావు, వనజకుమారి, మధుబాబు, విద్యార్థులు, ఆరోగ్య సిబ్బంది, ఆశా కార్యకర్తలు ఉన్నారు.

## చేపల గుంటలకు అనుమతులు తప్పనిసరి



**కోవూరు, డిసెంబరు 1 ప్రభాతవార్త :**కోవూరు మండలం కొత్తూరు గ్రామంలో ఇటీవల కాలంలో చేపలు గుంటలు ఎక్కువయ్యాయి. ఈ గుంటలు ఏర్పాటు చేసేందుకు తప్పనిసరిగా రెవెన్యూ, మత్స్యశాఖ , పొల్యూషన్ శాఖ అనుమతులు తప్పనిసరి. అవేమి లేకుండా ఇష్టారాజ్యంగా గుంటలు ఏర్పాటు చేయడంతో ఈ మేరకు గురువారం తహసీల్దార్ ఎం. పద్మజ కొత్తూరులో ఉన్న చేపల గుంటల వివరాలను నిశితంగా పరిశీలించారు. తప్పనిసరిగా గుంటలు ఏర్పాటు చేసేవారు అనుమతులు తప్పనిసరిగా తీసుకోవాలని ఈ సందర్భంగా ఆమె వారికి సూచించారు. ఈ కార్యక్రమంలో రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ ఎం. రమణయ్య, గ్రామ రెవెన్యూ అధికారి అశోక్‌రెడ్డిలు ఉన్నారు.

## గృహ నిర్మాణాలు వేగవంతం కావాలి



**కోవూరు, డిసెంబరు 1 ప్రభాతవార్త :** కోవూరు మండలంలోని జగనన్న కాలనీలో జరుగుతున్న గృహ నిర్మాణాలు మరింత వేగవంతం కావాలని ఎంపీడీవో శ్రీహరి పేర్కొన్నారు. కోవూరులోని మండల పరిషత్ కార్యాలయంలో గురువారం ఆయన గృహ నిర్మాణ శాఖ ఏఈ భాస్కర్‌రెడ్డితో నిర్మాణాల విషయమై ప్రత్యేకంగా చర్చించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ లబ్దిదారులు కూడా అధికారులకు సహకరించి నిర్మాణాలు వేగవంతం అయ్యేలా సహకరించాలన్నారు. కాంట్రాక్టర్లు కూడా చేపట్టే నిర్మాణాలు ప్రభుత్వం నిర్దేశించిన నియమ నిబంధనలకు లోబడి సాగేలా చూడాలన్నారు.

## ఫ్యామిలీ డాక్టర్ ఫిజీషియన్ మంచి కార్యక్రమం



**కోవూరు, డిసెంబరు 1 ప్రభాతవార్త :** రాష్ట్ర ప్రభుత్వం ఇటీవల నూతనంగా ప్రవేశపెట్టిన ఫ్యామిలీ డాక్టర్ ఫిజిషియన్ మంచి కార్యక్రమమని ఇనమడుగు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యులు డాక్టర్ ఇర్ఫాన్ తెలిపారు. కోవూరు మండలం గంగవరం పంచాయతీ రామచంద్రాపురం కాలనీలో గురువారం ఆయన పలు గృహాలను స్వయంగా పరిశీలించి వారికి సా ్వంతన చేయడమే కాకుండా పలు సూచనలు అందించి, మందులు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడూతూ బీపీ, షుగర్ రోగులు క్రమం తప్పకుండా మందులు వేసుకుని తమ ఆరోగ్యాన్ని సంరక్షించుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో వైద్య ఆరోగ్య సిబ్బంది, ఆశా కార్యకర్తలు ఉన్నారు.

## రైతు భూమిని ఆక్రమించారు



**కోవూరు, డిసెంబరు 1 ప్రభాతవార్త :** కోవూరులోని జాతీయ రహదారి సమీపంలో ఉన్న రైతు రామలింగేశ్వరరావు పొలం ఆక్రమించుకున్నారని, ఈ విషయంలో అధికారులు చొరవ తీసుకుని రైతుకు భూమి తిరిగి అప్పగించేలా సర్వే చేయించాలని సీపీఎం నాయకులు జి. శేషయ్య, ఎస్‌కే బాబులు తెలిపారు. ఈ మేరకు గురువారం తహసీల్దార్ ఎం. పద్మజకు వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో నేతలు ఎస్‌కే చాన్‌బాషా, పి. సురేంద్ర, పి. హరి. కృష్ణకుమార్, రాగలింగేశ్వరరావులు ఉన్నారు.

## ఎయిడ్స్‌పై యువత అవగాహన పెంచుకోవాలి



**కోవూరు, డిసెంబరు 1 ప్రభాతవార్త :** ఎయిడ్స్ వ్యాధిపై యువత పూర్తిస్థాయిలో అవగాహన పెంచుకోవాలని వైకేఆర్‌అండ్‌కే డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ లక్ష్మీప్రసూన తెలిపారు. కోవూరు మండలం నేతాజీ నగర్‌లోని వైకేఆర్‌అండ్‌కే డిగ్రీ కళాశాలలో గురువారం ప్రపంచ ఎయిడ్స్ దినోత్సవం సందర్భంగా అవగాహన సదస్సు ఏర్పాటు చేసి మానవహారం ర్యాలీ కార్యక్రమాన్ని నేతాజీనగర్ ప్రాంతంలో చేపట్టారు. ఈ కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ ప్రోగ్రామ్ అధికారి ఎం. మధుసూదన్‌రావు, రెడ్‌క్రాస్ క్లబ్ కోఆర్డినేటర్ డాక్టర్ కె. లావణ్య, కళాశాల అధ్యాపకులు ఏ. హరిప్రసాద్, డాక్టర్ ఆర్. విజయ, డాక్టర్ డి. ఈశ్వరరావు, డాక్టర్ శోభ, రెడ్‌క్రాస్ మోటివేటర్ బి. భాస్కర్‌రావు, ఎం. జాన్‌పాల్, డాక్టర్ ఈశ్వరరావు, డాక్టర్ విజయ, డాక్టర్ పి. సుదర్శన్, డాక్టర్ కె. శోభ, సురేంద్ర బాబు తదితరులు ఉన్నారు.

## గడపగడపకు మన ప్రభుత్వం నేడు

**కోవూరు, డిసెంబరు 1 ప్రభాతవార్త :** కోవూరు మండలం లేగుంటపాడు గ్రామంలో శుక్రవారం గడపగడపకు మన ప్రభుత ం కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు వైసీపీ మండల పార్టీ అధ్యక్షుడు ఎన్. సుబ్బారెడ్డి తెలిపారు. గురువారం ఆయన మాట్లాడుతూ ఈ కార్యక్రమానికి కోవూరు ఎమ్మెల్యే ప్రసన్నకుమార్‌రెడ్డి హాజరవుతారని, దీనిని పూర్తిస్థాయిలో విజయవంతం చేసేలా ప్రజాప్రతినిధులు, పార్టీ నాయకులు , కార్యకర్తలు పాల్గొని విజయవంతం చేయాలని ఈ సందర్భంగా ఆయన పిలుపునిచ్చారు.

## అజీజ్ వారం లోపు నీ టిడిపి జిల్లా అధ్యక్షుని పదవి ఔట్



**నెల్లూరు టౌన్, డిసెంబరు 1, ప్రభాతవార్త:** అజీజ్ నా ఆలోచన సరైనది అయితే వారం లోపు నీ తెలుగుదేశం పార్టీ జిల్లా అధ్యక్షుని పదవి పోతుందని ఇండియన్ నేషనల్ లీగ్ రాష్ట్ర అధ్యక్షులు సయ్యద్ సమీ హుస్సేనీ జోస్యం చెప్పారు. గురువారం స్థానిక ప్రెస్‌క్లబ్‌లో ఆయన ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ ఓ ముస్లీం మహిళ చేత పాయిజన్ బాటిల్ ఇచ్చి ఆత్మహత్యకు పాల్పడుతున్నట్లు ఎందుకు డ్రామా చేయించావు. కార్పొరేటర్ సత్తార్‌బాయ్‌పై చేసిన అనుచిత వ్యాఖ్యలపై చర్చకు రమ్మని అజీజ్‌కు సవాల్ విసిరితే ఇద్దరు చంచాగాల్లతో మాట్లాడిస్తావా ఇది నీ నీచపు రాజకయాలకు నిదర్శనమని ఆగ్రహం వ్యక్తం చేశారు. తెలుగుదేశం పార్టీకి గత్యంతరం లేని పరిస్థితుల్లో ఎడమ చేతిలో ఒక చెంచా కుడిచేతిలో మరో చెంచా పెట్టుకుని తిరిగే నిన్ను తెలుగుదేశం పార్టీ జిల్లా అధ్యక్షుడిగా కట్టబట్టారని ఈ పదవి కూడా నీ చేస్తాలతో ఓడిపోయేందుకు సిద్ధంగా ఉందన్నారు. అజీజ్ నీవు స్థాపించిన రొయ్యల పరిశ్రమ బాధితులు చాలా మంది నా వద్దకు వచ్చి మీ భాయ్ మమ్మల్ని మెట్టు నిలువైన ముంచేశాడని న్యాయం చేయమని పలువురు తమ వద్దకు వస్తే ఆయన పరిస్థితి బాగుంటే ఎవరికి అన్యాయం చేయడు అని చెప్పి సర్దుబాటు చేసి పంపిన ఘనత మాదని ఆయన గుర్తు చేశారు. నీలాగా ఓ మైనారిటీ మహిళ చేతిలో విషపు సీసా పెట్టి ఆత్మహత్య చేసుకుంటున్నట్లు నటించమని చెప్పి గోడ దెబ్బ, చెంపదెబ్బ కొట్టించుకున్న నీచ రాజకీయాలు మావి కాదని సమీ హుస్సేనీ పేర్కొన్నారు.

## నాడు నేడు పనులపై సమీక్ష



**సైదాపురం, డిసెంబరు1, ప్రభాతవార్త:** మండల కేంద్రమైన సైదాపురంలోని స్థానిక ప్రజా పరిషత్ కార్యాలయంలో ఎంపీడీవో పురుషోత్తం శివకుమార్ ఆధ్వర్యంలో మండల స్పెషల్ అధికారి శ్రావణ్‌కు మార్ గురు వారం ఇంజనీరింగ్ అసిస్టెంట్‌లతో సమా వేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా హౌసింగ్ ప్రోగ్రామ్, నాడు నేడు ద్వారా జరుగుతున్న పనులపై క్షేత్రస్థాయిలో ఎదురయ్యే సమస్యలను పరిష్కరిం చేందుకు చర్యలు తీసుకోవాలని తెలిపారు. 5వ తేదీ లోపు టార్గెట్ ప్రకారం పనులు పూర్తి చేయాలని ఆదేశించారు. ఈ సమావేశంలో హౌసింగ్ ఏఈ భాస్కర్‌రావు తదితరులు పాల్గొన్నారు.

## గడపగడపకులో 37 సచివాలయాలు పూర్తి చేశాం



**బుచ్చి డిసెంబర్ 1 ప్రభాతవార్త** నియోజవకర్గంలో ఆగష్టు నుండి ఇప్పటి వరకు 37 సచివాలయాల పరిధిలో గడగడపకు కార  ్యక్రమాన్ని పూర్తి చేసినట్లు కోవూరు శాసనసభ్యులు నల్లపరెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డి తెలి పారు. కట్టుబడిపాళెంలో గడపగడపకు మనప్రభుత్వం కార్యక్రమంలో ఆయన స్దానిక విలేఖర్లతో మాట్లాడుతు 37 వేలా 2 వందల గడపలకు వెళ్లి ప్రజల్ని కలవడం జరిగిందని చెప్పారు.3 సంవత్సరాలలో జగన్‌మో హన్‌రెడ్డి ఇచ్చిన పధకాలు అన్ని ప్రజలకు అందివునా న్నయి.ప్రజలు విశేషంగా ఆదరిస్తున్నారని ఆయన తెలి పారు.బుచ్చిరెడ్డిపాళెం శాంతినగర్‌లో నిజామాబాద్ రాజసభసభ్యులు ఉమ్మడి రాష్ట్రంలో స్పీకర్‌గా పనిచేసిన టువంటి సురేష్‌రెడ్డి 10 లక్షలు ఇచ్చారని అందులో 7 లక్షలు శాంతినగరల్ ఆర్‌ఒప్లాంట్‌కి ఇవ్వడం జరిగిం దని అన్నారు. విడవలూరులోని కాలేజి కాంపౌండ్ వాల్‌కి 3 లక్షలు ఇవ్వడం జరిగిందని చెప్పారు. జలజీవన్ మిషన్ కింద ఓవర్ హెడ్‌ట్యాంకులు కోటి 20 మంజూరు కావడం జరిగిందని చెప్పారు.బుచ్చిరెడ్డిపాళెంలో ఇస్కపాలెం పంచాయితీలోని వడి ్డపాళెం,పల్లాప్రోలు,పోలినాయుడు చెరువు,పెనుబల్లి గ్రామాలకు ఓవర్ హెడ్ ట్యాంకులు మంజూరు కావడం జరిగిందని అన్నారు.అలాగే నియోజకవర్గంలో 60 ఓవర్ హెడ్ ట్యాంకులు మంజూరు అయ్యాయని ఆయన తెలిపారు.18 కోట్లా 67 లక్షలు ఓవర్ హెడ్ ట్యాంకులకు మంజూరు కావడం జరిగిందని టెండర్లు పిలిచినట్లు ఆయన తెలిపారు. అలాగే దగదర్తి నుండి ఎన్‌డిబి నిధుల కింద 38 కోట్లతో రోడ్డు మంజూరు కావడం జరిగిందని టెంకాయకొట్టి పనులు ప్రారంభించినట్లు ఆయన తెలి పారు.గడగడపకు కార్యక్రమంలో కట్టుబడిపాళెంలోనే 6 కోట్లా81 లక్షలా 971 రూపాయాలు సంక్షేమప ధకాలకు ఇవ్వడం జరిగిందని చెప్పారు.ఈకార్యక్రమంలో నల్లపరెడ్డి రాజేంద్రకుమార్‌రెడ్డి,నగరపాలక పం చాయితీ చైర్మన్ మోర్ల సుప్రజ,వవ్వేరు బ్యాంకు చైర్మన్ సూరా శ్రీనివాసులురెడ్డి,మాజీ పెన్నాడెల్టా ప్రాజక్టు చైర్మన్ యర్రంరెడ్డి గోవర్ధన్‌రెడ్డి,జొన్నవాడ దేవస్దానం చైర మ్‌న్ పుట్టా సుబ్రమణ్యంనాయుడు,టంగుటూరు మల్లికార్జునరెడ్డి,ఇప్పగుంట విజయ్‌బాస్కర్‌రెడ్డి, ఎంపిపి మన్నెపల్లి శ్రీనివాసులు,నగర వైస్ చైర్‌పర్సన్ కోటంరెడ్డి లలితారెడ్డి,వైస్ చైర్మన్ షేక్ షాహుల్,తహసిల్దారు ప్రమీలా,ఎంపిడిఒ నరసింహారావు,కమీషనర్ చంద్రశేఖర్‌రెడ్డి,కౌన్సిలర్లు షేక్షకిలాబేగం,చీర్ల ప్రసాద్‌యాదవ్,శ్రీదేవి,నాగరాజు,శివకుమార్‌రెడ్డి,బెళ్ళం మల్లారెడ్డి,రాచూరుసత్యనారాయణ, యానాదిరెడ్డి, కంతాఅనంతమ్మ మండల పార్టీ కన్వీనర్ చెర్లో సతీష్‌రెడ్డి, మోర్ల మురళీ, మోర్ల భరత్ ,ఇన్నమూరి సత్యనారాయణ, కోటంరెడ్డి శ్రీకాంత్‌రెడ్డి,డాక్టర్ అల్లాబక్షు,చిరమణ సురేష్ , బట్టా ప్రవల్లి,బట్టా విల్సన్, కట్టుబడిపాలెం నాయకులు మోహన్,ఆమారి శ్రీనివాసులు, మాజీ ఎంపిటిసి సభ్యులు బాబు,పలువురు వైసిపి నాయకులు ,పలు శాఖల అధికారులు పాల్గొన్నారు.

## నియోజకవర్గంలో అటవీ శాఖ రెండు నగర వనాలు ఏర్పాటు




**బిట్రగుంట, డిసెంబరు 1 ప్రభాతవార్త** కావలి నియోజకవర్గంలో అటవీశాఖ ఆధ్వర్యంలో ఆహ్లాదకరమైన వాతావరణంలో రెండు నగర వనాలు ఏర్పాటు చేసేందుకు అటవీ శాఖ పలు ప్రతిపాదనలతో ముందుకు వచ్చినట్లు కావలి ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డి చెప్పారు. బోగోలు మండలం ముంగమూరు సెంట్రల్ నర్సరీలో గురువారం నగర వనాలు అభివృద్ధి కార్యక్రమంలో భాగంగా జిల్లా అటవీశాఖ అధికారులతో ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా విలేకర్లతో మాట్లాడుతూ నియోజకవర్గంలో జాతీయ రహదారి పక్కన ముంగమూరు ప్రాంతంలో వంద ఎకరాలలో, కావలి వద్ద ఉదయగిరి రోడ్డు ఎడమ వైపున మరొకటి ఏర్పాటు చేసేందుకు తగు ప్రణాళికలు రూపొందించి త్వరలో వీటిని కార్యరూపం చేయడం పట్ల ఆయన హర్షం వ్యక్తం చేశారు. ఈ నగర వనాలలో మోడల్ నర్సరీ, చిల్డ్రన్ పార్కు, వాకింగ్ ట్రాక్,యోగా, రెస్టారెంట్లు ఏర్పాటు చేసి ప్రయాణికులను ఆకర్షించే విధంగా ఆహ్లాదకరంగా రూపొందించడం జరుగుతుందన్నారు. స్వచ్ఛమైన ఆక్సిజన్ అందించే ఈ ప్రాంతంలో ఇటువంటి సౌకర్యాలు నెలకొల్పితే ఈ ప్రాంతాలు అభివృద్ధి చెందుతాయన్నారు. పర్యాటకులను ఆకర్షించే విధంగా వీటిని రూపకల్పన చేయడం జరిగిందని అంతేకాకుండా ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి పార్కులు, పర్యాటక ప్రాంతాల అభివృద్ధికి అత్యధిక నిధులు ఖర్చు పెడుతున్నారన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా అటవీశాఖ అధికారి ఎ.చంద్రశేఖర్‌రావు, కావలి సబ్ డివిజన్ డిఎఫ్‌వో టి.రాజశేఖర్‌బాబు, ఫారెస్ట్ రేంజ్ ఆఫీసర్ ఆర్.శ్రీనివాసులు, ముంగమూరు సర్పంచ్ సునీల్ తదితరులు పాల్గొన్నారు.

## ఉచిత వైద్యశిబిరంలో 508 మందికి వైద్య సేవలు




**కావలి రూరల్, డిసెంబరు 1 ప్రభాతవార్త** కావలి రూరల్ మండలం ఒట్టూరు మోడల్ పాఠశాలలో గురువారం నిర్వహించిన ఉచిత వైద్యశిబిరంలో 508 మంది విద్యార్థిని, విద్యార్థులకు వైద్య పరీక్షలు నిర్వహించారు. కావలి గుండెమడుగుల దేవదానం మెమోరియల్ హాస్పిటల్ ప్రముఖ వైద్య నిపుణులు, కావలి మాజీ మున్సిపల్ చైర్మన్ డాక్టర్ ఎన్.ప్రభాకర్‌నాయుడు సూచనలు, సలహాలతో ఉచిత వైద్యశిబిరం నిర్వహించారు. ఈ ఉచిత వైద్యశిబిరంలో డాక్టర్ గుండెమడుగుల దేవదానం మెమోరియల్ హాస్పిటల్ గుండె వ్యాధి నిపుణులు డాక్టర్ డి.సుధీర్‌కుమార్, దంత వైద్య నిపుణులు డాక్టర్ వినయ్ వినోద్‌బాబు పాల్గొని విద్యార్థులకు ఆరోగ్యం పట్ల తగిన సలహాలు, సూచనలు అందజేశారు. అవసరమైన వారికి ఉచిత పరీక్షలు నిర్వహించారు. గుండె వ్యాధులు, దంతాలకు సంబంధించిన వ్యాధులు గురించి అవగాహన కల్పించారు. ఆరోగ్య సమస్యలు వచ్చినప్పుడు వెంటనే వైద్యులను సంప్రదించాలన్నారు. ఒట్టూరు మోడల్ పాఠశాల ప్రిన్సిపాల్ ఇందిర అనీల్‌కుమారి మాట్లాడుతూ విద్యార్థులకు ఉచిత వైద్యశిబిరం ఏర్పాటు చేసేందుకు కృషి చేసిన డాక్టర్ ఎన్.ప్రభాకర్‌నాయుడు, డాక్టర్ సుధీర్‌కుమార్, డాక్టర్ వినయ్ వినోద్‌బాబులకు కృతజ్ఞతలు తెలిపారు.ఈ కార్యక్రమంలో విశ్రాంత వసతి గృహ సంక్షేమాధికారి ఎస్.కె.ఖాదర్‌బాషా, హాస్పిటల్ పిఆర్వో అక్కిలిగుంట ఆనంద్, పాఠశాల ఉపాధ్యాయులు, ఉపాధ్యాయేతర సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

## వైసిపి పాలనలోనే అందరికి సంక్షేమ ఫలాలు



**సీతారామపురం డిసెంబర్ 1 ప్రభాతవార్త** వైసిపి పాలనలోనే అర్హులైన ప్రతి ఒక్కరికి సంక్షేమపలాలు అందుతున్నాయని ఉదయగిరి ఎమ్మెల్యే మేకపాటి చంద్రశేఖర్‌రెడ్డి పేర్కొన్నారు.ఆయన గురువారం సింగారెడ్డిపల్లి,నాచరమ్మపల్లి గ్రామాలలో గడపగడకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఎన్నికల మ్యానిఫెస్టులో ఇచ్చిన హామిల మేరకు 98 శాతం నెరవేర్చిన ఘనత ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికే దక్కుతుందని అన్నారు.అన్ని వర్గాలకు సామాజిక న్యాయం వైసిపితోనే సాధ్యమని అన్నారు.మారుమూల ప్రాంతాలలో విద్యా,వైద్యం,రవాణాకు తమ హయాంలోనే నాందిపలికిందని అన్నారు. అనంతరం గడపగడపకు వెళ్లి ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పధకాలపై అవగాహన కల్పిస్తు లబ్దిదారులకు కరప త్రాలు అందించారు.ఈకార్యక్రమంలో జడ్‌పిటిసి రమణారెడ్డి,ఎంపిపి పద్మావతి,మండల వైసిపి కన్వీనర్ సుబ్బారెడ్డి,మాజీ ఎంపిపి అబ్రహాం, ఎంపిటిసి వెంకటమ్మ,సర్పంచ్ సంపూర్ణమ్మ, వైసిపినాయకులు రమణయ్య, తిరిపాలు, చంద్రమౌళి,సుబ్బారెడ్డి,తిరుపతయ్య తదితరులు పాల్గొన్నారు.

## కుటుంబ కలహాలతో సచివాలయ ఉద్యోగి మృతి



**కావలి రూరల్, డిసెంబరు 1 ప్రభాతవార్త** ఉదయగిరి మండలం గంగులవారి చెర్లోపల్లిలోని సచివాలయంలో డిజి టల్ అసిస్టెంట్‌గా పనిచేస్తున్న మారెడ్డి నరసింహరెడ్డి(53) కావలి ముసు నూరు రాఘవేంద్రనగర్‌లోని సాయిబాబా గుడి వద్ద ఇంట్లో మృతి చెందాడు. కావలి రూరల్ పోలీసుల కథనం మేరకు వివరాలు ఇలావు న్నాయి. మృతుడు మారెడ్డి నరసింహరెడ్డి కావలి పట్టణం గాయత్రినగర్‌కు చెందిన అ నూషాను ప్రేమించి పెళ్లి చేసుకున్నాడు. సచివాలయ ఉద్యోగిగా జాయినింగ్ లెటర్ ఇచ్చి గత మూడు నెలల నుండి ఇంటి వద్దనే వుంటూ మద్యానికి బానిసయ్యాడు. ఉద్యోగానికి వెళ్లకుండా వుండటంతో భార్యాభర్తల మధ్య గొడవలు జరిగాయి. దీంతో ఏడు నెలల కుమార్తెను తీసుకొని అనూషా నిద్ర చేసేందుకు తన పుట్టింటికి వెళ్లింది.బుధవారం మధ్యాహ్నం రాఘవేంద్రనగర్‌లోని తన ఇంటికి తాళం వేసినట్లు ఎంతసేపు తలుపు కొట్టినా తీయకపోవడంతో నరసింహారెడ్డి భార్య, ఆయన తల్లి ప్రభావతి ఇంటి వద్దకు వెళ్లి అడుగగా ప్రభావతి తెలియదని చెప్పింది. వెంటనే ప్రభావతి తన బంధువులతో కలిసి తాళం తీసి చూడగా నరసింహారెడ్డి చనిపోయినట్లు గుర్తించడం జరిగిందని తెలిపారు. తన కుమారుడు అనారోగ్యంతో కానీ భార్యాభర్తల మధ్య వున్న మనస్పర్ధల వల్ల కానీ ఎలుకల మందు తాగి కానీ చనిపోయి వుండవచ్చునని నరసిం హరెడ్డి తల్లి ప్రభావతి కావలి రూరల్ పోలీసులకు ఫిర్యాదు చేసింది. కావలి రూరల్ ఎస్ఐ వెంకట్రావు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

## నేడే శ్రీపోలేరమ్మ తల్లి
## నూతన ఆలయ భూమి పూజ

**ఇందుకూరుపేట డిసెంబర్ 1 ప్రభాతవార్త** ఇందుకూరుపేట మండలంలోని నర్సాపురం తూర్పు గిరిజన కాలీనిలో శుక్రవారంటిటిడి దేవస్దానం ఆర్ధిక సహాయంతో సమరసతాసేవ పౌండేషన్ ఆద్వర ్యంలోభూమి పూజ నిర్వహిస్తున్నట్లు దేవస్దాన కమీటి నిర్వాహకులు కోనేటి ప్రమీలమ్మ ఎందోటి సుజాత,ఏనుగంటి సరోజనమ్మ, అల్లారెడి ్డబాబు,వలమూడి సునీల్,ఎందేటి సురే ంద్రలుతెలిపారు. ఈకార్యక్రమాన్ని కాలనీలో ఉన్న భక్తులందరు పాల్గొని పూజ కార్యక్రమాని జయప్రదం చేసితీర్ద ప్రసాదాలు స్వీకరించాల్సిందిగా కోరారు.

## ఎల్ఆర్ఎస్ గడవు పొడిగింపు



**నెల్లూరు కార్పొరేషన్, డిసెంబరు 1, ప్రభాతవార్త:** లేఅవుట్ రెగ్యులేషన్ స్కీం (ఎల్ఆర్ఎస్) గడవును 2023వ సంవత్సరం జనవరి 31వ తేదీ వరకు పొడిగించారని, ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని లేఅవుట్ యజమానులకు నగరపాలక సంస్థ కమిషనర్ డి.హరిత సూచించారు. నగరపాలక సంస్థ కార్యాలయం పురా సేవ మందిరంలో ఎల్ఆర్ఎస్ మేళాను గురువారం నిర్వహించారు. మేళాను సందర్శించిన అనంతరం కమిషనర్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం జీవో నెంబరు 10 ద్వారా 08.01.2020 తేదీని అనుసరించి క్రమబద్ధీకరణకు అర్జీలు దాఖలు చేసిన లేఅవుట్ యజమానులు, లేఅవుట్‌కు సంబంధించిన పూర్తి ధ్రువీకరణ పత్రాలను కార్యాలయంలో సమర్పించి అనుమతులు పొందాలని సూచించారు. సచివాలయ వార్డు ప్లానింగ్, రెగ్యులేషన్ కార్యదర్శులు తమ పరిధిలోని లేఅవుట్‌లను గుర్తించి ఎల్ఆర్ఎస్ పై యజమానులకు అవగాహన కల్పించాలని సూచించారు. కార్యదర్శుల లాగిన్‌లలో ఉన్న పెండింగ్ అప్లికేషన్‌లను ప్రభుత్వ మార్గదర్శకాలను అనుసరించి త్వరితగతిన పూర్తి చేయాలని కమిషనర్ ఆదేశించారు. ఎల్ఆర్ఎస్ మేళా ద్వారా 16 అప్లికేషన్‌లకు ఫీజులు చెల్లించేందుకు అనుమతించామని, 7 అప్లికేషన్‌లను తిరస్కరించగా, 7 షార్ట్‌ఫాల్స్‌గా గుర్తించామని తెలిపారు. మిగిలిన అప్లికేషన్‌లను త్వరితగతిన పూర్తి చేయాలని టౌన్ ప్లానింగ్ అధికారులను కమిషనర్ ఆదేశించారు. ఎల్ఆర్ఎస్ మేళాలో టౌన్ ప్లానింగ్ అధికారులు, సచివాలయ వార్డు ప్లానింగ్ రెగ్యులేషన్ సెక్రటరీలు, సిబ్బంది పాల్గొన్నారు.

## మంచి వ్యవసాయ పద్దతులు ధృవీకరణపై శిక్షణ



**పొదలకూరు డిసెంబర్ 1 ప్రభాతవార్త** పొదలకూరు పట్టణంలోని వ్యవసాయ శాఖ ఆద్వర్యంలో గురువారం పొదలకూరు సబ్‌డివిజనల్‌పరిధిలోని పొదలకూరు చేజర్ల ,కలువాయి,రాపూరు సైదాపురం,మండలాల వివిఎ,విహెచ్ఎ,ఎంపిఇఒలకుమంచి వ్యవసాయ పద్ ్దతులు,ధృవీకరణ పద్దతులపై శిక్షణా కార ్యక్రమాన్ని నెల్లూరు జిల్లా వ్యవసాయాధికారిజి .సుధాకర్‌రాజు ఆద్వర్యంలో నిర్వహించారు. ఈకార్య క్రమంలో పాల్గొన్న నెల్లూరు డిడిఎ సత ్యవాణి మాట్లాడుతు మట్టినమూనా సేకరణ భూసార పరీక్ష ఫలితాల ఆధారంగా ఎరువులు వాడుకొనుట మరియు పచ్చిరొట్ట పైర్ల ఉపయోగాలుసబ్సిడీల గురించి వివరించారు.అలాగే డిఆర్‌సి ఏడిఎ మాదవి మాట్లాడుతు జీవన ఎరువు వంటి వాటి గురించి వివరించారు.అలాగే పొదలకూరు సహాయసంచాలకులు శివనాయక్ మాట్లాడుతు వ్యవసాయ సాగు పద్దతులు,విత్తన ధృవీకరణ అధిక పురుగు మందుల వాడకం అనర్దాల గురించి వివరించారు.ఈకార్యక్రమంలో పొదలకూరు మండల వ్యవసాయ అధికారి ఎ వాసు,వి ప్రతాప్,వి శశిదర్,పి హైమావతి,చక్రవర్తి తదితరులు పాల్గొన్నారు.

## మాగుంట కుటుంబీకుల సేవలు మరవలేనివి



**కావలి, డిసెంబరు 1 ప్రభాతవార్త** మాగుంట కుటుంబీకుల సేవలు మరువలేనివని కావలి ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డి తెలిపారు. గురువారం కావలి ఆర్టీసి బస్టాండ్ సెంటర్‌లోని సుబ్బరామిరెడ్డి విగ్రహం వద్ద 27వ వర్ధంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం జరిగిన కార్యక్రమంలో ఎమ్మెల్యే ప్రతాప్‌కుమార్‌రెడ్డి మాట్లాడారు. రాజకీయాలకు అతీతంగా మాగుంట సుబ్బరామిరెడ్డి, కావలి మాజీ ఎమ్మెల్యే మాగుంట పార్వతమ్మలు కావలి నియోజకవర్గాన్ని ఎంతో అభివృద్ధి చేశారన్నారు. వారి సేవల బాటలో పయనిస్తానన్నారు. మాజీ మంత్రి కలికి యానాదిరెడ్డి, మాజీ ఎంపి మాగుంట సుబ్బరామిరెడ్డిలను ఆదర్శంగా తీసుకోవాలన్నారు. ఈ మంచి నేతల్ని ఎప్పుడు గుర్తు పెట్టుకోవాలన్నారు. వెంగళరావునగర్ అభివృద్ధికి, వంద అడుగుల రోడ్డు ఏర్పాటుకు మాగుంట పార్వతమ్మ చేసిన కృషి ఎంతైనా అభినందనీయమన్నారు. వారు చేసిన సేవలు ఎవరు మర్చిపోలేనివన్నారు. త్వరలో తుమ్మలపెంట రోడ్డు, ట్రంకురోడ్డు అభివృద్ధిని చేపడతామన్నారు. పట్టణ, నియోజకవర్గ అభివృద్ధే ధ్యేయంగా పెట్టుకొని పనిచేస్తున్నానన్నారు.ఈ కార్యక్రమంలో వైసిపి నేతలు అమరా వేదగిరి సుబ్బరాయుడు గుప్తా, గంధం ప్రసన్నాంజనేయులు,కలికి శ్రీనివాసులురెడ్డి, కనపర్తి రాజశేఖర్, మైనార్టీ నేత షేక్ రషీద్, నాగాచారి, వైసిపి నేతలు పాల్గొన్నారు.




## కౌన్సిలర్ ప్రమీలమ్మను పరామర్శించిన ఎమ్మెల్యే ప్రసన్న



బుచ్చి డిసెంబర్ 1 ప్రభాతవార్త బుచ్చిరెడ్డిపాళెం నగర పంచాయితీ 16 వవార్డు కౌన్సిలర్ బిట్రగుంట ప్రమీలమ్మను కోవూరు శాసనసభ్యులు నల్లపరెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డి పరామర్శించారు.ఇటీవల ఆమె అనారోగ్యానికి గురికావడంతో విషయం తెలుసుకున్న ఆయన వారి స్వగ్రహానికి వెళ్లి ఆమెను పరామర్శిం చారు .ఈకార్యక్రమంలో చైర్‌పర్సన్ మోర్ల సుప్రజ, పెన్నాడెల్టా ప్రాజక్టు మాజీ చైర్మన్ ఎర్రంరెడ్డి గోవర్ధన్‌రెడ్డి,మండల పార్టీ కన్వీనర్ చెర్లో సతీష్‌రెడ్డి,ఇప్పగుంట విజయ్‌బాస్కర్‌రెడ్డి, నగర కమీషనర్ చంద్రశేఖర్‌రెడ్డి,సిఐ కోటేశ్వరరావు,ఎస్ఐ కోటేశ్వరరావు, వైఎస్ చైర్మన్ షేక్ షాహుల్, కౌన్సిలర్లు పుట్టా శివకుమార్‌రెడ్డి, వైష్ణవి,శ్రీదేవి,మోర్ల భరత్‌కుమార్, డాక్టర్ అల్లాబక్ష దళితనాయకులు పర్రిబాబు తదితరులున్నారు.

## ఒక యజ్ఞంలా నిర్మాణాలు పూర్తికావాలి



**కోవూరు, డిసెంబరు 1 ప్రభాతవార్త :** రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన నవరత్నాలు, పేదలకు ఇల్లు కార్యక్రమంలో భాగంగా జగనన్న కాలనీల్లో జరుగుతున్న గృహ నిర్మాణాలు ఒక యజ్ఞంలా పూర్తయ్యేలా చర్యలు తీసుకోవాలని గృహ నిర్మాణ శాఖ ప్రాజెక్టు డైరెక్టర్ నాగరాజు అన్నారు. కోవూరులోని గృహ నిర్మాణ శాఖ డీఈ కార్యాలయంలో గురువారం ఆయన పలు రికార్డు రిజిస్టర్లు పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అన్ని శాఖల అధికారులు సమిష్టిగా కృషి చేస్తేనే నూరుశతం లక్ష్యాలు చేరుకునేందుకు అవకాశం ఉంటుందన్నారు. జిల్లాను రాష్ట్రంలోనే ముందంజలో ఉండేలా దృష్టి పెట్టాలన్నారు. జిల్లాలో డిసెంబర్ 21వ తేదిన 10 వేల గృహాలు గృహ ప్రవేశాలు చేసేలా లక్ష్యంగా నిర్ణయించడం జరిగిందన్నారు. జిల్లాలో 58070 గృహాలు మంజూరు కాగా, అందులో 4160 పూర్తయ్యాయని, మిగిలినవన్నీ వివిధ దశల్లో ఉన్నాయన్నారు. సిమెంట్ , కమ్ముల స్టాక్ విషయంలో ఎటువంటి డోకా లేదని, స్టాక్ సమృద్ధిగా ఉందని ఈ సందర్భంగా ఆయన తెలియజేశారు. గృహ నిర్మాణ శాఖ ఏఈలు ఇంజనీరింగ్ అసిస్టెంట్లతో కలిసి కాలనీలకు వెళ్లి లబ్దిదారులతో మమేకమై నిర్మాణాలు వేగవంతం అయ్యేందుకు దృష్టి పెట్టాలన్నారు. ఈ కార్యక్రమంలో గృహ నిర్మాణ శాఖ డీఈ జగదీశ్వరి, ఏఈ భాస్కర్‌రెడ్డిలు ఉన్నారు.

## ప్రపంచ ఎయిడ్స్‌నియంత్రణ దినోత్సవ ర్యాలీ




**కావలి, డిసెంబరు 1 ప్రభాతవార్త** కావలి పట్టణం ఆశానికేతన్ రూరల్ హెల్త్ సెంటర్ ఆధ్వర్యంలో గురువారం ప్రపంచ ఎయిడ్స్ నియంత్రణ దినోత్సవ భారీ ర్యాలీ జరిగింది. కావలి పాతవూరు మున్సిపల్ పాఠశాల నుండి ఉదయగిరి బ్రిడ్జి సెంటర్ వరకు ఈ ర్యాలీ సాగింది. ఈ కార్యక్రమంలో సిస్టర్ జసింత, జెనీవా, సుబ్బారావు, శ్రీనివాసులు, కృష్ణకుమారి, డాక్టర్ రవి కాంత్, నలంద విద్యా సంస్థల చైర్మన్ యం. డి.మజహర్, డైరెక్టర్ వసీమ్, మున్సిపల్ పాఠశాల హెడ్మాస్టర్ పద్మతులసి, మాజీ సర్పంచ్ బాలకృష్ణ, తదితరులు పాల్గొని మాట్లాడారు. ఎయిడ్స్ వ్యాధి అంటు వ్యాధి కాదని ఎవరు ఆందోళన చెందాల్సిన అవసరం లేదన్నారు. ఎయిడ్స్ వ్యాధి గ్రస్తులు జాగ్రత్తలు పాటించాలన్నారు. సమాజంలో వారిని వివక్షతకు గురికానీయవద్దన్నారు.

